# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 10 సంచిక : 32 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ మంగళవారం 6 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME 10 ISSUE :32 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA TUE 6 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## అంబటి రాంబాబుకు కిర్లంపూడి పోలీసుల నోటీసులు

- ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల ఘటనపై విచారణ
- ఈ నెల 8న హాజరు కావాలని నోటీసుల్లో వెల్లడి
- వేరే పనులున్నాయని, మరో తేదీ చెబుతానని అంబటి సమాధానం

పెన్ పవర్ డెస్క్:వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు పోలీసులు సోమవారం నోటీసులు జారీ చేశారు.

- మిగతా 2లో




# ఇంటింటికీ జలధార..

## రూ.30,156 కోట్లతో బృహత్ పథకం ప్రారంభించిన చంద్రబాబు, పవన్

- ప్రొద్దుటూరులో 'అమరజీవి జలధార' పనులకు శ్రీకారం
- రూ.30,156 కోట్లతో 27 లక్షల కుటుంబాలకు సురక్షిత తాగునీరు
- రాయలసీమ రైజింగ్‌ను ఎవరూ అడ్డుకోలేరన్న చంద్రబాబు
- గోదావరి పుష్కరాల లోపు పోలవరం పూర్తి చేస్తామని హామీ
- గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
- గొడ్డలి పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పారన్న సీఎం



పెన్ పవర్ డెస్క్:గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీటిని అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జల్ జీవన్ మిషన్ 2.0లో భాగంగా రూ.30,156 కోట్ల భారీ వ్యయంతో చేపట్టిన 'అమరజీవి జలధార' పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోమవారం ప్రారంభించారు. కడప జిల్లా ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని కొత్తపల్లిలో వారు పైలాన్‌ను ఆవిష్కరించి ఈ బృహత్ పథకానికి అంకురార్పణ చేశారు.

ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మరో 27 లక్షల గ్రామీణ కుటుంబాలకు కొత్తగా కుళాయి కనెక్షన్లు అందించనున్నారు. ఇందుకోసం 13,075 ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, 77,243 కిలోమీటర్ల పైపులైన్ల విస్తరణ పనులు చేపట్టనున్నారు. ఈ పనులు పూర్తయితే రాష్ట్రంలో మొత్తం 3.3 కోట్ల మందికి సురక్షిత తాగునీరు అందుబాటులోకి వస్తుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఇప్పటికే 62 లక్షల కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు

- మిగతా 2లో

# 2029 నాటికి 4-స్టార్..

## ప్రభుత్వ స్కూళ్లపై మంత్రి లోకేశ్ సమీక్ష.. అధికారులకు కీలక ఆదేశాలు!



- ఏడాదిలోగా వన్-స్టార్ స్కూళ్లను టూ-స్టార్‌గా మార్చాలని ఆదేశం
- 2029 నాటికి రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో 4-స్టార్ సదుపాయాల కల్పన లక్ష్యం
- ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని నిర్ణయం
- ఏజెన్సీ ప్రాంత పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచన

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఈ విషయంలో నిర్దేశిత లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా చేరుకోవాలని

- మిగతా 2లో



## రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదు.. అభివృద్ధి

- రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదని, అభివృద్ధి అని పవన్ కల్యాణ్ వ్యాఖ్య
- ప్రొద్దుటూరులో రూ.30,156 కోట్లతో అమరజీవి జలధార పథకానికి శ్రీకారం
- గత ప్రభుత్వం జలజీవన్ మిషన్ నిధులను నిర్వీర్యం చేసిందని తీవ్ర విమర్శ
- పులివెందుల, అరకులోనూ వివక్ష లేకుండా అభివృద్ధి పనులు చేస్తున్నామని వెల్లడి
- ఇది కక్షసాధింపుల ప్రభుత్వం కాదు, ప్రజాభివృద్ధి ప్రభుత్వమని స్పష్టీకరణ

- మిగతా 2లో

## వివేకా హత్య కేసులో జగన్ మౌనం నేరాంగీకారమే

- టికెట్ కోసం రూ.40 కోట్ల సుపారీ ఇచ్చారని జగన్‌పై తీవ్ర ఆరోపణలు
- రాయలసీమ, ప్రకాశం జిల్లాలను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు ప్రణాళికలు
- పల్లె పండుగ 3.0, జలజీవన్ మిషన్‌తో రాష్ట్రంలో అభివృద్ధి పనులు వేగవంతం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ

- మిగతా 2లో



# నిజం బయటపడ్డది..




## సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై రాహుల్ ఫైర్

పెన్ పవర్ డెస్క్: సర్ ప్రక్రియలో అవకతకవలు, ఫారమ్ 6లో మార్పులు, సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఏకపక్ష తీరుపై ఆరోపణలకు సంబంధించి కేంద్ర

- మిగతా 2లో



# 'మా అనుమతి లేదు'..

## ఫారమ్-6పై సుప్రీంకోర్టు షాకింగ్ కామెంట్స్

పెన్ పవర్ డెస్క్:కొత్త ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఉపయోగించే ఫారమ్-6లో చేసిన మార్పులపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సవరించిన ఫారమ్-6కు తాము అనుమతి ఇవ్వలేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. ఈ వ్యవహారాన్ని పూర్తిగా పరిశీలిస్తామని చెప్పారు. ఫారమ్-6లో అసలు మార్పు జరిగిందా? జరిగితే ఎవరు చేశారు? అనే విషయాలను తేల్చాల్సి ఉందని కోర్టు తెలిపింది. దీనికి సంబంధించిన రికార్డులు తమ ముందుకు వచ్చిన తర్వాతే అంశాన్ని లోతుగా పరిశీలిస్తామని

- మిగతా 2లో

- ఫారమ్-6 మార్పులకు అనుమతి ఇవ్వలేదని సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- మార్పు ఎవరు చేశారో తెలుసుకుంటామన్న సీజేఐ
- రికార్డులు చూశాకే పూర్తిస్థాయి విచారణ ఉంటుందని వెల్లడి
- ఫారమ్-6ను సవరించలేదని ఈసీ స్పష్టీకరణ
- 'సర్' కోసం అదనపు డిక్లరేషన్ మాత్రమే చేర్చామని వెల్లడి



## రేపిస్టులకు భయం పుట్టాలి.. సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

పెన్ పవర్ డెస్క్:పెరుగుతున్న అత్యాచార ఘటనపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. అత్యాచారం చేసే వారికి శిక్షలు మరింత కఠినంగా ఉండాలని .. రేప్ చేయాలం టేనే భయపడి పోవాలని ఢిల్లీ పోలీసులు కీలక ఆదేశాల జారీ చేసింది. ఢిల్లీ ఎన్ సీఆర్ అత్యాచారం కేసు విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది.

- మిగతా 2లో




## భారత్-అమెరికా వాణిజ్య చర్చలపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు

- భారత్-అమెరికా వాణిజ్య చర్చల్లో స్తబ్దత ఏర్పడిందన్న నిర్మలా సీతారామన్
- ప్రస్తుతం వాణిజ్యం భారత్‌కే అనుకూలంగా ఉందని వెల్లడి
- వాణిజ్య లోటును తగ్గించుకోవాలని అమెరికా భావిస్తోందని వ్యాఖ్య
- ఈయూ ఒప్పందాన్ని విజయవంతమైన ఉదాహరణగా చూపిన ఆర్థిక మంత్రి

పెన్ పవర్ డెస్క్:భారత్, అమెరికాల మధ్య కొంతకాలంగా కొనసాగు తున్న వాణిజ్య ఒప్పంద చర్చలు దాదాపుగా తుది దశకు చేరుకున్నప్పటికీ, ప్రస్తుతం అవి ప్రతిష్టంభనలో ఉన్నట్లు కనిపిస్తున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.

- మిగతా 2లో

## వైద్య రంగంలో ఈ ఏడాది ముగ్గురికి నోబెల్..

### మెదడు రహస్యాలను ఛేదించిన 'ఆప్టోజెనెటిక్స్

- వైద్యశాస్త్రంలో 2026 నోబెల్ బహుమతి ముగ్గురికి సంయుక్తంగా ప్రకటన
- కార్ల్ డీస్సెరొత్, పీటర్ హెగెమాన్, జార్జ్ నాజెల్‌లను వరించిన పురస్కారం
- ఆప్టోజెనెటిక్స్ అనే టెక్నిక్‌ను అభివృద్ధి చేసినందుకు ఈ గౌరవం
- కాంతిని ఉపయోగించి మెదడులోని నరాల కణాలను నియంత్రించడం దీని ప్రత్యేకత
- జ్ఞాపకాలు, భావోద్వేగాలను అర్థం చేసుకోవడంలో ఈ ఆవిష్కరణ ఒక మైలురాయి

- మిగతా 2లో



## ఓటుకు నోటు కేసులో కీలక మలుపు..

### సుప్రీంకోర్టులో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్



- ఓటుకు నోటు కేసులో సుప్రీంకోర్టును ఆశ్రయించిన మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్
- ఈ కేసులో తనను ఇంప్లీడ్ చేయాలని పిటిషన్ దాఖలు
- బాధితుడిగా తన వాదనలు వినాలని కోర్టుకు విజ్ఞప్తి
- కేసును కొట్టివేయాలన్న రేవంత్ రెడ్డి పిటిషన్‌పై విచారణ వేళ ఈ పరిణామం
- పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకున్న సుప్రీం, విచారణ వాయిదా

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

## ఓటుకు నోటు కేసులో కీలక మలుపు.. సుప్రీంకోర్టులో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 2015 నాటి ఓటుకు నోటు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన ఫిర్యాదుదారు, నామినేటెడ్ మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన వాదనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా అదనపు వాదనలు వినిపించేందుకు తనకు అవకాశం కల్పించాలని స్టీఫెన్‌సన్ తన పిటిషన్‌లో కోరారు. ప్రధాన ఫిర్యాదుదారుగా తన వాదనలను వినడం నిష్పక్షపాత విచారణకు అత్యంత కీలకమని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు నివేదించారు. ఈ ఇంప్లీడ్ పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంటూ, తదుపరి విచారణను వాయిదా వేసింది. 2015 జూన్‌లో జరిగిన తెలంగాణ శాసనమండలి ఎన్నికల సందర్భంగా ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. టీడీపీ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేసేందుకు అప్పటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి (ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి) రూ. 50 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో తెలంగాణ ఏసీబీ కేసు నమోదు చేసి రేవంత్ రెడ్డి సహా ముగ్గురిని అరెస్ట్ చేయడంతో పాటు నగదును స్వాధీనం చేసుకుంది. ఈ కేసులో ఆడియో, వీడియో రికార్డింగులను కీలక ఆధారాలుగా పేర్కొన్నారు. తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ రేవంత్ రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ క్వాష్ పిటిషన్‌పై విచారణ జరుగుతున్న తరుణంలో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. తాజా పరిణామాలతో తెలుగు రాష్ట్రాల రాజకీయ, న్యాయ వర్గాల్లో ఈ కేసు మరోసారి చర్చనీయాంశంగా మారింది. తదుపరి విచారణలో ధర్మాసనం ఎలాంటి నిర్ణయం తీసుకోనుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

# నిజం బయటపడ్డది..

- మొదటి పేజి తరువాయి

ఎన్నికల సంఘానికి సుప్రీం కోర్టు నోటీసులు ఇవ్వడంపై లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. ఈ మేరకు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ట్వీట్ చేసిన రాహుల్ గాంధీ.. ఫారమ్ 6లో మార్పులకు ఎటువంటి ఆమోదం తెలపలేదన్న సుప్రీంకోర్టు వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ సీఈసీ జ్ఞానేష్ కుమార్?పై ఫైర్ అయ్యారు.

'జ్ఞానేష్ కుమార్ ఫారం 6ను చట్టవిరుద్ధంగా, ఏకపక్షంగా మార్చారన్నది ఇప్పుడు నిస్సందేహంగా రుజువైంది. బీజేపీకి సహాయం చేయడానికి అతను తన పదవిని దుర్వినియోగం చేస్తున్నాడనడానికి ఇది మరో రుజువు మాత్రమే. మన ప్రజాస్వామ్యంపై జరిగిన ఈ నేరపూరిత దాడిలో పాలుపంచుకున్న జ్ఞానేష్?తో పాటు ప్రతి ఒక్కరూ జవాబుదారీగా ఉంటారు" అని రాహుల్ హెచ్చరించారు. కేంద్ర ఎన్నికల సంఘానికి సుప్రీం కోర్టు నోటీసులు ఇచ్చిన తర్వాత సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేసింది.

**ఈసీ, కేంద్రానికి సుప్రీం కోర్టు నోటీసులు**

సర్ ప్రక్రియలో అవకతకవలు, ఫారమ్ 6లో మార్పులు, సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలపై ఆయనను పదవి నుంచి తొలగించాలని సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలు అయ్యాయి. అక్టోబర్ 5న ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు.. ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఎన్నికల సంఘంలో మిగిలిన ఇద్దరు కమిషనర్ల ఆమోదం లేకుండా సీఈసీ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారనే ఆరోపణలపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

అంతేకాకుండా, ఫామ్ 6 మార్పులకు తాము ఎటువంటి ఆమోదం తెలపలేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఫామ్ 6?లో మార్పులు ఎవరు చేశారో రికార్డులను సమర్పించాలని ఆదేశించింది. దేశంలోవ కోట్ల సంఖ్యలో ఓటర్లను తొలగించారన్న ఆరోపణల వేళ కేంద్ర ఎన్నికల సంఘానికి సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేయడం దేశ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## రేపిస్టులకు భయం పుట్టాలి.. సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

- మొదటి పేజి తరువాయి

నేరం పాల్పడే వారి మనసులో చట్టం పట్ల భయాన్ని కలిగించడం అవసరమని కోర్టు తెలిపింది. నేరం చేస్తే ఏం జరుగుతుందో , వాటి పరిణామాలకుభయపడకపోతే, అటువంటి నేరాలను నివారించడం కష్టమని అత్యున్నత న్యాయస్థానం నొక్కి చెప్పింది.

సమాజంలోని ప్రతి మహిళ మన తల్లి, సోదరి వంటిది. మనం వారికి భద్రతా భావాన్ని కల్పించాలి. మనం ఇంట్లో మహిళల భద్రతను ఎలాగైతే నిర్ధారిస్తామో, సమాజంలో కూడా అలాగే చేయాలి. ఒక మహిళ బస్సులో ఒంటరిగా ప్రయాణిస్తుంటే, పోలీసులకు ఆమె గురించి సమాచారం ఉండాలని, ఆమె భద్రతపై చురుకుగా వ్యవహరించాలని కోర్టు పేర్కొంది. ఈ కేసులో తదుపరి విచారణ నవంబర్ 16కు వాయిదా వేసింది.

**నేరాలపై నిఘాకోసం వార్ రూం..**

నేరాల నియంత్రణకు ఓ వార్ రూం ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఢిల్లీపోలీసులను ఆదేశించింది. నేరాలను అరికట్టడంలో ఢిల్లీ పోలీసులు ఏవైనా ప్రత్యేక చర్యలు చేపట్టారా.. వార్ రూం లాంటిది ఏర్పాటు ఏదైనా ఏర్పాటు చేశారా అని పోలీసులను ప్రశ్నించింది. జాతీయ డేటా బేస్ ద్వారా అనుమానిత క్రిమినల్స్, ప్రమేయం ఉన్న వ్యక్తులపై నిఘా పెట్టాలని అధికారులను కోర్టు కోరింది. మహిళలు, విద్యార్థులనుపదే పదే వేధించే వ్యక్తులు ఉన్నారని, అన్ని ఏజెన్సీలు కలిసి నిఘా ఉంచితే పరిస్థితిని చక్కదిద్ద వచ్చని తెలిపింది. మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులకు వార్నింగ్ ఇచ్చింది. విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు 2012 నిర్భయ కేసును కూడా ప్రస్తావించింది. అనుమతి లేకుండా నడుస్తున్న హోటళ్లలో మద్యం కూడా అందిస్తున్న ప్రదేశాలపై దృష్టి సారించాలని కోర్టు ఢిల్లీ పోలీసులను కోరింది. 2012 నాటి ఘటనకు సంబంధించిన రికార్డుల ప్రకారం, నిందితురాలు నేరం చేయడానికి ముందు ఓ ప్రదేశంలో భోజనం , మద్యం సేవించినట్లు కోర్టు పేర్కొంది.ఢిల్లీలోని భద్రతా ఏర్పాట్లపై కూడా కీలక వ్యాఖ్యలు చేసింది. బహిరంగ ప్రదేశాలు, పార్కులలో తగినంత లైటింగ్ ఏర్పాటు చేయాలని సొలిసిటర్ జనరల్ ను కోరింది. క్షేత్రస్థాయిలో పోలీస్ నిఘా, జవాబుదారితనం, నియంత్రణ చర్యల అవసరాన్ని ధర్మాసనం నొక్కిచెప్పింది.

## భారత్-అమెరికా వాణిజ్య చర్చలపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు

- మొదటి పేజి తరువాయి

ఇరు దేశాల మధ్య వాణిజ్యం ప్రస్తుతం భారత్‌కు అనుకూలంగా ఉండటంతో, ఆ లోటును తగ్గించుకోవడానికి అమెరికా తీవ్రంగా ప్రయత్నిస్తోందని ఆమె వెల్లడించారు.సోమవారం ఢిల్లీలో నిర్వహించిన 'మ్యూనిచ్ లీడర్స్ మీటింగ్ 2026'లో ఆమె మాట్లాడారు. "వాణిజ్య ఒప్పందం కోసం ఇరు దేశాలు పట్టుదలగా చర్చలు జరిపాయి. ప్రస్తుతం ఇచ్చిపుచ్చుకునే ధోరణికి అతీతంగా చర్చలను ముందుకు తీసుకెళ్లడం కష్టతరంగా మారింది" అని ఆమె అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ, ఈ చర్చలను మరింత ముందుకు తీసుకెళ్లే అవకాశాలను ఇరుపక్షాలు అన్వేషించవచ్చని సూచించారు.భారత్‌తో వాణిజ్యం వల్ల తమకు ఏళ్లుగా నష్టం జరుగుతోందన్న అమెరికా ఆందోళన ఈ చర్చల్లో స్పష్టంగా ప్రతిబింబిస్తోందని ఆమె తెలిపారు. ఫిబ్రవరి 2026లో ప్రకటించిన మధ్యంతర వాణిజ్య ఒప్పంద ముసాయిదా ప్రాతిపదికన ఈ చర్చలు కొనసాగుతున్నాయి.ఇదే క్రమంలో భారత్-యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందాన్ని ఆమె ఒక విజయవంతమైన ఉదాహరణగా పేర్కొన్నారు. యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ అభివర్ణించినట్లుగా ఇది 'తల్లి లాంటి ఒప్పందం' అని ఆమె కొనియాడారు. ఈ ఒప్పందంలో భాగంగా భారత్ 92.5 శాతం టారిఫ్ లైన్లను, 97 శాతం వాణిజ్య విలువను అందుబాటులోకి తెస్తే, ఈయూ తన వైపు నుంచి 97 శాతం టారిఫ్ లైన్లను, 99 శాతం వాణిజ్య విలువను విముక్తం చేసిందని ఆమె వివరించారు.

# ఇంటింటికీ జలధార..

- మొదటి పేజి తరువాయి

ఉండగా, ఈ కొత్త పథకంతో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

**రాయలసీమ రైజింగ్.. అభివృద్ధి ఆగదు**

ఈ సందర్భంగా ప్రొద్దుటూరులో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగించారు. రాయలసీమకు 'రప్పారప్పా' రాజకీయం కాదని, అభివృద్ధి, సంక్షేమం కావాలని స్పష్టం చేశారు. రాయలసీమ అభివృద్ధి బుల్లెట్‌లా దూసుకెళ్తుందని, దానిని ఎవరూ ఆపలేరని అన్నారు. రూ.1 లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేసి సీమ దశ, దిశ మారుస్తామని ప్రకటించారు. భవిష్యత్తులో శత్రు దేశాలను చీల్చిచెండాడే ఫైటర్ జెట్లు 'మేడ్ ఇన్ రాయలసీమ' అని చెప్పుకునే రోజులు వస్తాయని, ఇక్కడ పండే ఫలాలు 'రాయలసీమ బ్రాండ్'తో ప్రపంచ మార్కెట్లకు ఎగుమతి అవుతాయని ధీమా వ్యక్తం చేశారు. రానున్న గోదావరి పుష్కరాల లోపే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రధాని మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని పునరుద్ఘాటించారు.

**గొడ్డలి పార్టీపై తీవ్ర విమర్శలు**

గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. 2024 ఎన్నికల్లో ప్రజలు గొడ్డలి పార్టీకి గట్టిగా బుద్ధి చెప్పారని వ్యాఖ్యానించారు. వివేకా హత్య కేసు నుంచి మద్యం కుంభకోణం వరకు అన్ని వేళ్లూ ఆ పార్టీ అధినేత వైపే చూపిస్తున్నాయని ఆరోపించారు. కుట్రలు, ఫేక్ ప్రచారమే ఆ పార్టీ సిద్ధాంతమని, వారి డీఎన్ఏలోనే నేరాలు చేసి ఇతరులపై నెట్టేయడం ఉందని ఎద్దేవా చేశారు. అసెంబ్లీకి రాకుండా ప్రతిపక్ష

హోదా కోరడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

కేంద్రం, రాష్ట్రంతో పాటు స్థానిక సంస్థల్లోనూ కూటమి అధికారంలో ఉంటే 'ట్రిపుల్ ఇంజిన్ సర్కార్'తో అభివృద్ధి వేగవంతం అవుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎస్.సవిత, పి.నారాయణ, బీసీ జనార్దన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# 2029 నాటికి 4-స్టార్..

- మొదటి పేజి తరువాయి

రాష్ట్ర ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో వసతుల కల్పన, నైపుణ్యాభివృద్ధి అంశాలపై సోమవారం ఉండవల్లిలోని తన నివాసంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. ఏడాదిలోగా రాష్ట్రంలోని వన్-స్టార్ పాఠశాలలన్నింటినీ టూ-స్టార్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని స్పష్టం చేశారు. అలాగే, ప్రస్తుత విద్యా సంవత్సరంలోగా జీరో-స్టార్ రేటింగ్ ఉన్న పాఠశాలలన్నింటినీ కనీసం వన్-స్టార్ స్థాయికి చేర్చాలని సూచించారు. 2029 నాటికి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను 4-స్టార్ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని, కనీసం వెయ్యి పాఠశాలలను 5-స్టార్ స్థాయికి చేర్చేలా పటిష్ఠ ప్రణాళికలు రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా ఏజెన్సీ, వెనుకబడిన ప్రాంతాల్లోని పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 "లీప్ స్కూళ్లను" అభివృద్ధి చేసేందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలని కోరారు.ప్రస్తుతం రాష్ట్రంలో 1,685 వన్-స్టార్... 15,618 టూ-స్టార్... 19,099 త్రీ-స్టార్... 7,172 ఫోర్-స్టార్ పాఠశాలలు ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పురోగతిపై డీఈవోలు, ఎంఈవోలు, సీఆర్పీలకు బాధ్యతలు అప్పగించాలని లోకేశ్ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 7 వేల హైస్కూళ్లలో పూర్తిస్థాయిలో కంప్యూటర్ ల్యాబ్స్, అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అకడమిక్ సంస్కరణలు పూర్తయినందున, ఇకపై అధికారులు, ఉపాధ్యాయులు పూర్తిగా అభ్యసన ఫలితాల మెరుగుదలపైనే దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

**నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట**

విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించేందుకు కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) ద్వారా ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్, నేషనల్ అప్రెంటిస్‌షిప్ స్కీమ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. నిరుద్యోగ యువతను "నైపుణ్యం పోర్టల్" పరిధిలోకి తీసుకువచ్చి, ఏఐ సాంకేతికత ద్వారా వారికి ఇంటర్వ్యూలు నిర్వహించాలన్నారు. సీడాప్, ఓంక్యాప్‌ల ద్వారా జర్మన్, జపనీస్ వంటి విదేశీ భాషల్లో శిక్షణనిచ్చి, విదేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో మానవ వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు, ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ రంజిత్ బాషా, రాష్ట్ర విద్యా మౌలిక సదుపాయాల సంస్థ ఎండీ దీవెన్ రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ సీఈవో నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

## వివేకా హత్య కేసులో జగన్ మౌనం నేరాంగీకారమే

సొంత బాబాయ్ వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో దర్యాప్తు సంస్థలన్నీ ఆధారాలతో తాడేపల్లి ప్యాలెస్ వైపే చూపిస్తున్నప్పటికీ, మాజీ ముఖ్యమంత్రి జగన్ మౌనం వహించడం ఆయన నేరాన్ని అంగీకరించడమేనని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్రంగా ధ్వజమెత్తారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కడప ఎంపీ టికెట్ కోసం ఏకంగా రూ.40 కోట్ల సుపారీ ఇచ్చి సొంత కుటుంబాన్నే బలితీసుకున్న చరిత్ర జగన్‌ది కాదా అని సూటిగా ప్రశ్నించారు.ఈడీ, సీబీఐ వంటి సంస్థలు దర్యాప్తును వేగవంతం చేస్తుంటే, సమాధానం చెప్పలేక జగన్ ముఖం చాటేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రి పదవిని అడ్డుపెట్టుకుని ఈ కేసును నీరుగార్చారని, పులివెందులలోకి కేంద్ర దర్యాప్తు అధికారులు రాకుండా అడ్డుకున్నది వైసీపీ ప్రభుత్వమేనని ఆయన ఆరోపించారు.

**అభివృద్ధి, సంక్షేమంలో కూటమి ప్రభుత్వం పరుగులు**

ఒకవైపు వైసీపీ విధ్వంసకర రాజకీయాలకు పాల్పడుతుంటే, తమ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరుగులు పెట్టిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రొద్దుటూరు వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కలిసి 61.60 లక్షల కుళాయిల ద్వారా 27.36 లక్షల కుటుంబాలకు తాగునీరు అందించే 'జలజీవన్ మిషన్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. 'పల్లె పండుగ 3.0' కింద రూ.1,185 కోట్లతో సీసీ, బీటీ రోడ్లు, మినీ గోకులాలు, మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం ముమ్మరంగా సాగుతోందన్నారు. పీఎంఏవై గ్రామీణ్ 2.0 ద్వారా రాష్ట్రంలో రూ.7,170 కోట్లతో పేదలకు మూడు లక్షల పక్కా ఇళ్లు నిర్మిస్తున్నామని వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం సెంటున్నర స్థలం పేరుతో భూదందాలకు పాల్పడితే, తాము పారదర్శకంగా సంక్షేమ ఫలాలను అర్హులకు అందిస్తున్నామని స్పష్టం చేశారు.

**రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ**

రాయలసీమ సాగునీటి కష్టాలను తీర్చడానికి ఎన్టీఆర్ హంద్రీ-నీవా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తే, చంద్రబాబు తన పాలనలో నిధులు కేటాయించి కుప్పం వరకు కృష్ణా జలాలను తీసుకువచ్చారని రాంప్రసాద్ రెడ్డి గుర్తుచేశారు. రాయలసీమతో పాటు ప్రకాశం జిల్లాను కలుపుకొని పది జిల్లాలను 'హార్టికల్చర్ హబ్'గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసిందన్నారు. హైదరాబాద్‌లో ఐఎస్‌బీని ఏర్పాటు చేసిన స్ఫూర్తితో, మంత్రి నారా లోకేశ్ చొరవతో దేశంలోనే తొలిసారిగా 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్'ను రాష్ట్రానికి తీసుకువస్తున్నామని వెల్లడించారు.

**స్థానిక ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట**

తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ బీసీలకు అండగా నిలుస్తుందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంతో పాటు, అధిక స్థానాలను కేటాయించడానికి కట్టుబడి ఉన్నామని మంత్రి స్పష్టం చేశారు. గత వైసీపీ పాలనలో దౌర్జన్యాలతో స్థానిక సంస్థలను కైవసం చేసుకున్నారని, ఇప్పుడు చట్టబద్ధంగా, పారదర్శకంగా ఎన్నికలు జరుగుతాయని అన్నారు. కూటమి ప్రభుత్వ సుపరిపాలన, అభివృద్ధి, మెరుగైన శాంతిభద్రతలే తమకు శ్రీరామరక్ష అని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించి చంద్రబాబుకు ఘన విజయాన్ని కానుకగా అందిస్తామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## వైద్య రంగంలో ఈ ఏడాది ముగ్గురికి నోబెల్..

### మెదడు రహస్యాలను ఛేదించిన 'ఆప్టోజెనెటిక్స్

ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ పురస్కారాల ప్రకటన ప్రారంభమైంది. 2026 సంవత్సరానికి గాను వైద్యశాస్త్రంలో (ఫిజియాలజీ/మెడిసిన్) ముగ్గురు శాస్త్రవేత్తలు సంయుక్తంగా ఈ అత్యున్నత పురస్కారానికి ఎంపికయ్యారు. అమెరికాకు చెందిన కార్ల్ డీస్సెరొత్ (స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ), జర్మనీకి చెందిన పీటర్ హెగెమాన్ (హంబోల్ట్ యూనివర్సిటీ), జార్జ్ నాజెల్ (వుర్జ్‌బర్గ్ యూనివర్సిటీ) ఈ గౌరవాన్ని దక్కించుకున్నారు. 'కాంతి ఆధారిత అయాన్ చానెళ్లు, ఆప్టోజెనెటిక్స్'పై వారు చేసిన అద్భుతమైన ఆవిష్కరణలకు గాను నోబెల్ కమిటీ వారిని ఎంపిక చేసినట్లు సోమవారం ప్రకటించింది. ఈ ఆవిష్కరణ న్యూరోసైన్స్ (నాడీశాస్త్రం) రంగంలో ఒక కొత్త శకానికి నాంది పలికింది.మన మెదడు జ్ఞాపకాలను, భావోద్వేగాలను, ప్రవర్తనలను ఎలా నియంత్రిస్తుందనేది ఎన్నో శతాబ్దాలుగా ఒక పెద్ద మిస్టరీ. 20వ శతాబ్దంలో శాస్త్రవేత్తలు మెదడులోని ఏయే ప్రాంతాలు ఏయే పనులను ప్రభావితం చేస్తాయో పరిశోధించడం మొదలుపెట్టారు. కానీ, అప్పటి పద్ధతులతో కచ్చితమైన కారణాలను నిర్ధారించడం సాధ్యపడలేదు. వారి వద్ద ఉన్న మెదడు చిత్రం, ఎన్నో ప్రశ్నలతో, ఖాళీలతో నిండిన ఒక చిత్తుపటంగానే మిగిలిపోయింది. అయితే, ఆప్టోజెనెటిక్స్ రాకతో ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. "ఒకప్పుడు కల అనుకున్న మెదడును మ్యాపింగ్ చేసే అవకాశాన్ని ఆప్టోజెనెటిక్స్ సాకారం చేసింది" అని నోబెల్ కమిటీ ఛైర్మన్ పెర్ స్వెన్నింగ్‌సన్ వ్యాఖ్యానించారు.ఈ అద్భుత ఆవిష్కరణకు పునాది వేసింది పీటర్ హెగెమాన్ జిజ్ఞాస. 'క్లామిడోమోనాస్' అనే ఒకే కణం కలిగిన నాచు (ఆల్గే) కాంతి ఉన్నవైపు ఎలా ఈదగలుగుతోందని ఆయన ఆలోచించారు. 2000ల ప్రారంభంలో, ఆయన తన సహచరుడు జార్జ్ నాజెల్‌తో కలిసి ఆ నాచు కణం ఉపరితలంపై 'ఛానెల్‌రోడాప్సిన్' అనే ఒక ప్రత్యేకమైన ప్రోటీన్‌ను కనుగొన్నారు. దీనిపై నీలి రంగు కాంతి పడినప్పుడు, ఆ ప్రోటీన్‌లో ఒక మార్గం (ఛానెల్) తెరుచుకుని, అయాన్లు కణం లోపలికి ప్రవహించి ఒక విద్యుత్ సంకేతాన్ని సృష్టిస్తాయని వారు గుర్తించారు. ఈ ప్రోటీన్‌ను ఏ కణంలో ప్రవేశపెట్టినా, ఆ కణం కాంతికి స్పందించేలా మారుతుందని నిరూపించారు.

ఈ పరిశోధనను కార్ల్ డీస్సెరొత్ మరో స్థాయికి తీసుకెళ్లారు. ఆయన ఛానెల్‌రోడాప్సిన్ జన్యువును ఎలుకల మెదడులోని నరాల కణాలలోకి ప్రవేశపెట్టారు. ఆ తర్వాత వాటిపై నీలి కాంతిని ప్రసరింపజేసి, నరాల సంకేతాలను విజయవంతంగా ప్రేరేపించగలిగారు. 2005లో ఆయన ఈ ప్రయోగాన్ని ప్రచురించగా, రెండేళ్ల తర్వాత 2007లో బతికున్న ఎలుకల మెదడులో ఈ 'కాంతి ఆధారిత స్విచ్' పనిచేసేలా చేసి సంచలనం సృష్టించారు.ప్రస్తుతం 'ఆప్టోజెనెటిక్స్' అని పిలుస్తున్న ఈ పద్ధతి ప్రపంచవ్యాప్తంగా వేగంగా ప్రాచుర్యం పొందింది. దీనిని ఉపయోగించి పరిశోధకులు నిర్దిష్ట జ్ఞాపకాలు, భయం, ఆనందం వంటి భావోద్వేగాలు, ప్రవర్తనలను నియంత్రించే నాడీ వలయాలను (న్యూరల్ సర్క్యూట్స్) ఛేదిస్తున్నారు. ఇది మానసిక, నాడీ సంబంధిత వ్యాధులపై మన అవగాహనను పెంచుతోంది. వైద్య రంగంలో, దృష్టి లోపం ఉన్నవారికి తిరిగి చూపును అందించే ప్రయత్నాలలో ఈ పద్ధతిపై ప్రయోగాలు జరుగుతున్నాయి. ఆప్టోజెనెటిక్స్ ఆవిష్కరణ మన మెదడుపై ఉన్న అవగాహనను సమూలంగా మార్చేసింది. ఈ సాంకేతికత సాయంతో ప్రతిరోజూ కొత్త ఆవిష్కరణలు వెలుగులోకి వస్తూ, మానవాళి ముందున్న అతిపెద్ద రహస్యాలలో ఒకటైన మన మెదడు పనితీరును అర్థం చేసుకోవడానికి మార్గం సుగమం చేస్తున్నాయి.

## రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదు.. అభివృద్ధి

"యుద్ధం వచ్చినప్పుడు, హద్దులు దాటినప్పుడు నా గొంతు ఎలా ఉంటుందో మీకు తెలుసు. కానీ ఇది శాంతి సమయం. ప్రజలకు అభివృద్ధి చేయాల్సిన సమయం. అందుకే రాయలసీమ పౌరుషానికి తగిన స్పీచ్ మాట్లాడట్లేదు. రాయలసీమ అభివృద్ధికి అవసరమైన విధంగా మాట్లాడుతున్నా. గొడవలు, కొట్లాటలు, గొడ్డలి పోట్లు కాకుండా అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్దాం" అంటూ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాయలసీమ పౌరుషాన్ని ప్రస్తావిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గొడవలకు, పౌరుషానికి ప్రతీకగా నిలిచిన ఈ నేల రూపురేఖలను అభివృద్ధి పథంలో మార్చాలని ఆయన పిలుపునిచ్చారు. కడప జిల్లా ప్రొద్దుటూరులో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి రూ.30,156 కోట్ల విలువైన 'అమరజీవి జలధార' పథకానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పవన్ కల్యాణ్ తనదైన శైలిలో ప్రసంగించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు మీద ఈ బృహత్తర తాగునీటి పథకాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని పవన్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3.27 కోట్ల మంది ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో 24,601 ఆవాసాల్లో 50,315 పనులను ఈ పథకం కింద చేపట్టనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన 'హర్ ఘర్ జల్ - జలజీవన్ మిషన్'కు 2019-24 మధ్య అధికారంలో ఉన్న ప్రభుత్వం తూట్లు పొడిచింది. రూ.26,000 కోట్ల విలువైన పనులకు ప్రతిపాదనలు పంపి, ఐదేళ్లలో కేవలం రూ.2,700 కోట్లు మాత్రమే ఖర్చు చేసి ఏ ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదు. ప్రజల తాగునీటి కష్టాలను ఏమాత్రం పట్టించుకోలేదు" అని దుయ్యబట్టారు.2024లో ఈ పథకం ముగిసిపోవాల్సిన తరుణంలో, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తాను, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు సి.ఆర్. పాటిల్, నిర్మలా సీతారామన్‌లను కలిసి విజ్ఞప్తి చేశామని గుర్తుచేశారు. వారి సహకారంతో ఈ పథకాన్ని 2028 వరకు పొడిగించుకుని, పనులను వేగవంతం చేశామని తెలిపారు. "గత ప్రభుత్వం ఖర్చు చేయగా మిగిలిన పనులతో పాటు, ఇప్పటికే మేము రూ.4,500 కోట్ల విలువైన పనులను పూర్తి చేశాం. మీరు మాపై ఉంచిన నమ్మకమే మాకు శ్రీరామరక్ష" అని పవన్ పేర్కొన్నారు.తమది కక్షసాధింపుల ప్రభుత్వం కాదని, ప్రజాభివృద్ధిని మాత్రమే లక్ష్యంగా పెట్టుకుందని పవన్ స్పష్టం చేశారు. "దశాబ్దాలుగా తాగునీటి సమస్యతో అల్లాడుతున్న పులివెందుల నియోజకవర్గంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పథకాలకు రూ.280 కోట్లు కేటాయించి 7 మండలాల్లోని 299 గ్రామాలకు నీరందిస్తున్నాం. అలాగే, వైసీపీ ఎంపీ ఉన్నప్పటికీ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు, పాడేరు నియోజకవర్గాల్లో రూ.2,500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. మాకు పార్టీలు కాదు, ప్రజల సమస్యలే ముఖ్యం" అని ఉద్ఘాటించారు.గత ప్రభుత్వ హయాంలో తమ పార్టీకి మద్దతిచ్చారనే కారణంతో ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని తాళ్లమాపురం గ్రామ ప్రజలను నాటి శాసనసభ్యుడు తీవ్రంగా అవమానించారని, వారి వినతిపత్రాన్ని కళ్లెదుటే నలిపి పడేశారని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ గ్రామాల అభివృద్ధి కోసం తక్షణమే రూ.3.5 కోట్లతో సీసీ రోడ్లు, తాగునీటి పథకాలను మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి సమక్షంలో ప్రకటించారు.రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా మౌలిక వసతులను కల్పిస్తున్నామని గణాంకాలతో వివరించారు. "రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి 2024 వరకు నిర్మించిన వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లు, రిజర్వాయర్ల సామర్థ్యానికి అదనంగా 50 శాతం నుంచి 175 శాతం వరకు కేవలం ఈ ఐదేళ్లలోనే నిర్మించబోతున్నాం" అని తెలిపారు. నీటిని అందించడం ప్రభుత్వ బాధ్యత అయితే, దాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 'మా అనుమతి లేదు'.. ఫారమ్-6పై సుప్రీంకోర్టు షాకింగ్ కామెంట్స్

- మొదటి పేజి తరువాయి

సీజేఐ చెప్పారు. "సవరించిన ఫారమ్-6ను మేం ఆమోదించలేదు. ఇది స్పష్టం" అని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు.అయితే ఫారమ్-6ను సవరించలేదని ఎన్నికల సంఘం చెబుతోంది. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (సర్) కోసం కొత్త ఓటర్లకు అదనపు డిక్లరేషన్ మాత్రమే జత చేశామని వివరిస్తోంది. ఈ అదనపు ప్రకటనను జులైలో చేర్చారు. ఇందులో తల్లిదండ్రులు లేదా తాత, అమ్మమ్మల పాత ఓటరు జాబితా వివరాలను అనుసంధానించాల్సి ఉంటుంది.ఫారమ్-6 రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్-1960లో భాగం. ఈ నిబంధనల్లో మార్పులు చేయాలంటే అధికారికంగా సవరణ చేయాల్సి ఉంటుంది. సెప్టెంబరు 29న తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాకేత్ గోఖలే ఈ అంశాన్ని లేవనెత్తారు. ఫారమ్-6 మార్పులకు సంబంధించి ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి ప్రతిపాదన తమ వద్ద లేదని న్యాయశాఖ ఆర్టీఐ సమాధానంలో చెప్పినట్లు ఆయన తెలిపారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఒంటరిగానే నిర్ణయాలు తీసుకున్నారా? అనే అంశంపైనా సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది. గత 10 నెలల్లో 'సర్'కు సంబంధించిన నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు ఇటీవల ఓ కథనం వెలువడిన విషయం తెలిసిందే.

## అంబటి రాంబాబుకు కిర్లంపూడి పోలీసుల నోటీసులు

- మొదటి పేజి తరువాయి

వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల సందర్భంగా జరిగిన ఘటనకు సంబంధించి విచారణకు హాజరు కావాలని కిర్లంపూడి పోలీసులు ఈ నోటీసుల్లో పేర్కొన్నారు.ఈ నెల 8వ తేదీన విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో స్పష్టం చేయగా, అంబటి రాంబాబు దీనిపై స్పందించారు. ఆ రోజు తనకు ఇతర కార్యక్రమాలు ఉన్నాయని, విచారణకు ఎప్పుడు హాజరయ్యేది త్వరలోనే తెలియజేస్తానని ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు.

**కేసు నేపథ్యం ఇదే..**

ఈ ఏడాది జూలై 16న వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అంబటి రాంబాబు అడ్డుకున్నారని, విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిని నెట్టివేశారని ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై అప్పట్లోనే కిర్లంపూడి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో భాగంగానే తాజాగా విచారణకు రావాలంటూ అంబటి రాంబాబుకు నోటీసులు అందజేశారు.

# 20వ రోజుకు చేరిన వీఆర్ఏల నిరసన దీక్ష




**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 05:**మండల కేంద్రమైన ఆలమూరు తాసిల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న ధర్నా చౌక్ వద్ద ఆంధ్రప్రదేశ్ విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమాలు 20వ రోజుకు చేరుకున్నాయి. సోమవారం కురిసిన వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వీఆర్ఏలు తమ నిరసనను ఉధృతంగా కొనసాగించారు. ఈ సందర్భంగా వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షులు తాతపూడి ఇస్సాకు మాట్లాడుతూ.. తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం కల్పించాలని, అర్హులైన వారికి ప్రమోషన్లు ఇవ్వాలని మరియు ఇతర దీర్ఘకాలిక సమస్యలను తీర్చాలని కోరారు. వర్షాలు, ఎండలను లెక్కచేయకుండా క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న వీఆర్ఏల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల వీఆర్ఏల సంఘం నాయకులు, మహిళా ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో వీఆర్ఏలు పాల్గొని సంఘీభావం ప్రకటించారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

## ప్రత్తిపాడులో దశరా మహోత్సవాలకు రాట ముహూర్తం



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, అక్టోబర్, 05:**ప్రత్తిపాడు ఫారెస్ట్ చెక్‌పోస్ట్ సమీపంలోని శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద దశరా మహోత్సవాలకు రాట ముహూర్త కార్యక్రమాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు గురు భవాని పత్రి రమణ, ఆలయ నిర్వాహకులు మార్లపూడి అప్పలరాజు తదితరుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రాటను ఏర్పాటు చేశారు. దశరా మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు

## భావి భారతాన్ని తీర్చిదిద్దే అక్షర శిల్పులు మన ఉపాధ్యాయులే



**రామచంద్రపురం, పెన్ పవర్, అక్టోబర్ 5:**ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శుభాకాంక్షలు
ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులందరికీ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. నవ సమాజ నిర్మాణంలో, విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందిస్తూ, వారిని క్రమశిక్షణ కలిగిన ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ, "సమాజంలో మార్పునకు, పురోగతికి ఉపాధ్యాయులే మూలస్తంభాలు. అజ్ఞానమనే చీకట్లను పారద్రోలి, విజ్ఞాన దీపాలను వెలిగించే గురువుల సేవలు వెలకట్టలేనివి" అని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ విద్యార్థులను ప్రపంచస్థాయి పోటీకి సిద్ధం చేస్తున్న ఉపాధ్యాయుల కృషి ఎంతో అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. మన ప్రభుత్వం విద్యా, శ్రామిక రంగాల పురోగతికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు ఉపాధ్యాయులు, కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఉపాధ్యాయ లోకానికి అభినందనలు తెలియజేస్తూ, వారి ఆశయ సాధనకు అందరం అండగా నిలుద్దామని మంత్రి పిలుపునిచ్చారు. భావి తరాలను ప్రయోజకులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులందరికీ మరోసారి ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# కాకినాడ యువత భవిష్యత్తుకు స్కిల్, స్టార్టప్, భారత్ హబ్








- ఏటా 1,000 మందికి ఉద్యోగాలు.. 100 మంది ఎంటర్‌ప్రెన్యూర్ల తయారీ లక్ష్యం
- రూ.5.30 కోట్ల ఎంపీ ల్యాడ్స్ నిధులతో తొలి దశ పనులకు శంకుస్థాపన
- పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ.. శిక్షణతోనే ఉద్యోగం కల్పించే దిశగా అడుగులు
- రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు

**కాకినాడ జిల్లా పెన్ పవర్ ప్రతినిధి, అక్టోబర్ 5:**కాకినాడ జిల్లా యువతకు స్థానికంగానే నైపుణ్య శిక్షణ అందించి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు యువతలో పారిశ్రామిక స్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో 'స్కిల్, స్టార్టప్, భారత్ హబ్'లిలిను ఏర్పాటు చేస్తున్నట్లు రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు తెలిపారు. ఈ హబ్ ద్వారా ఏటా సుమారు 1,000 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, 100 మంది ఎంటర్‌ప్రెన్యూర్లను తయారు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. కాకినాడ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో రెండు ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న భారత్ హబ్ స్కిల్ సెంటర్కు సోమవారం శంకుస్థాపన జరిగింది. తొలి దశలో రూ.5.30 కోట్ల రాజ్యసభ ఎంపీ ల్యాడ్స్ నిధులతో స్కిల్ సెంటర్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబుతో పాటు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖరం, కర్రి పద్మశ్రీ, కాకినాడ అర్బన్, రూరల్, పెద్దాపురం, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు, పంతం నానాజీ, నిమ్మకాయల చిన్నరాజప్ప, వరుపుల సత్యప్రభ, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి తదితరులు హాజరయ్యారు.

### యువత సమస్యలపై సర్వే.. ఉద్యోగాలపై ప్రత్యేక దృష్టి

ఈ సందర్భంగా సానా సతీష్ బాబు మాట్లాడుతూ, సుమారు మూడేళ్ల క్రితం 'కాకినాడ జిల్లా కోసం' అనే కార్యక్రమం ద్వారా ఇంటింటికీ, విద్యార్థుల వద్దకు వెళ్లి ప్రశ్నావళి ద్వారా సర్వే నిర్వహించినట్లు తెలిపారు. ఆ సర్వేలో సుమారు 80 శాతం మంది ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలపైనే ప్రధానంగా దృష్టి సారించాలని కోరినట్లు వివరించారు. యువత అవసరాలను గుర్తించి వాటికి అనుగుణంగా ప్రణాళిక రూపొందించాలనే ఆలోచనతోనే స్కిల్, స్టార్టప్, భారత్ హబ్కు శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. స్థానిక యువతకు కేవలం శిక్షణ ఇవ్వడం కాకుండా, ఆ శిక్షణకు అనుగుణంగా ఉద్యోగాలు, స్వయం ఉపాధి అవకాశాలను కల్పించడమే ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు.

### 'వన్ హోమ్--వన్ ఎంటర్‌ప్రెన్యూర్' దిశగా

ఈ హబ్‌లో నైపుణ్యాభివృద్ధితో పాటు ఇంక్యుబేషన్, స్టార్టప్ సహకారం, పారిశ్రామిక మార్గదర్శకత్వం వంటి సేవలను అందించనున్నట్లు సానా సతీష్ బాబు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిపాదిస్తున్న 'వన్ హోమ్--వన్ ఎంటర్‌ప్రెన్యూర్' ఆలోచనకు అనుగుణంగా ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త ఎదిగేలా యువతను ప్రోత్సహించాలన్నదే లక్ష్యమన్నారు. ఉద్యోగం కోసం ఎదురుచూసే యువతతో పాటు, ఇతరులకు ఉద్యోగాలు కల్పించే స్థాయికి యువతను తీసుకెళ్లడమే హబ్ ఉద్దేశమని తెలిపారు. ఐడియా ఉన్న యువతకు అవసరమైన శిక్షణ, మార్గదర్శకత్వం, ఇంక్యుబేషన్ సహకారం అందించి వారి ఆలోచనలను వ్యాపారాలుగా తీర్చిదిద్దే వేదికగా భారత్ హబ్ పనిచేస్తుందని వివరించారు.

### రూ.15--20 కోట్లతో బహుళ దశల్లో అభివృద్ధి

రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును దశలవారీగా అభివృద్ధి చేయనున్నట్లు ఎంపీ తెలిపారు. తొలి దశలో స్కిల్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. రెండో దశలో తుని, కోనసీమ తదితర దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు కాకినాడలోనే ఉండి శిక్షణ పొందేందుకు వసతి సౌకర్యాలు, హాస్టల్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్లు తెలిపారు. దేశంలో, రాష్ట్రంలో వినూత్నమైన హైబ్రిడ్ మోడల్ స్కిల్--స్టార్టప్ సెంటర్‌గా దీనిని తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. యువతలో ఆవిష్కరణలను ప్రోత్సహించే విధంగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ తరహా ఆలోచనలను కూడా ఇందులో సమ్మిళితం చేస్తున్నట్లు తెలిపారు.

### పరిశ్రమల అవసరాలకే అనుగుణంగా శిక్షణ

స్థానిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ అందించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు సానా సతీష్ బాబు వెల్లడించారు. ఇప్పటికే కాకినాడ పరిసరాల్లోని దివీస్ ఫార్మా, అరబిందో ఫార్మా, ఏఎం గ్రీన్, కోరమండల్ ఫెర్టిలైజర్స్ వంటి ప్రముఖ పరిశ్రమల ప్రతినిధులతో చర్చలు జరిపినట్లు తెలిపారు. పరిశ్రమలకు ప్రస్తుతం, భవిష్యత్తులో అవసరమయ్యే నైపుణ్యాలను గుర్తించి, అదే రంగాల్లో యువతకు శిక్షణ అందించి, శిక్షణ పూర్తయిన వెంటనే ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా సంస్థలతో ఒప్పందాలు చేసుకుంటున్నట్లు వివరించారు. దీంతో యువతకు శిక్షణకు, పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు.

### ప్రజలందరి భాగస్వామ్యంతో భారత్ హబ్

'స్కిల్, స్టార్టప్, భారత్ హబ్' ప్రభుత్వం, ఎంపీ లేదా ఎమ్మెల్యేల వ్యక్తిగత కార్యక్రమం కాదని.. కాకినాడ ప్రజలందరి కార్యక్రమమని సానా సతీష్ బాబు స్పష్టం చేశారు. స్థానిక వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు, యువత, ప్రజలు ఈ కార్యక్రమంలో భాగస్వాములై తమ సలహాలు, సూచనలు, సహకారం అందించాలని పిలుపునిచ్చారు. కాకినాడ యువతకు భవిష్యత్తుకు బలమైన పునాదులు వేయడం, వారికి స్థానికంగానే అవకాశాలు అందించడం, ఉద్యోగార్థులుగా కాకుండా ఉద్యోగాలు కల్పించే పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం తమ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

### ఎంపీకి ఘన సన్మానం

ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబును ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. అనంతరం భారత్ హబ్ నిర్మాణ పనులు, భవిష్యత్‌లో చేపట్టనున్న స్కిల్ డెవలప్‌మెంట్, స్టార్టప్, ఇంక్యుబేషన్ కార్యక్రమాలపై చర్చించారు.
కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు పిల్లి అనంతలక్ష్మి, ఎస్.వి.ఎన్.ఎస్. వర్మ, నాయకులు జ్యోతుల నవీన్ కుమార్, కాకినాడ నగర కమిషనర్ ఎన్ వివి సత్యనారాయణ,వీరబాబు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.
కాకినాడ యువతకు నైపుణ్యం--ఉద్యోగం--పారిశ్రామికవేత్త అనే మూడు మార్గాలను ఒకే వేదికపైకి తీసుకురావడమే 'స్కిల్, స్టార్టప్, భారత్ హబ్' ప్రధాన లక్ష్యంగా నిలుస్తోంది.



# త్రేయపురం గ్రామాభివృద్ధికి రూ.3.50 కోట్ల బాటలు









- పల్లె పండుగకు ఆత్రేయపురం నూతన శోభ
- సీసీ రహదారులు, డ్రైనేజీలు, అంగన్వాడీ భవనం ప్రారంభం
- రైతులకు అందుబాటులోకి కస్టమ్ హైరింగ్ సెంటర్ సేవలు
- గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 5:** గ్రామీణ మౌలిక వసతుల విస్తరణకు పెద్దపీట వేస్తూ ఆత్రేయపురం గ్రామంలో రూ.3.50 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సీసీ రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, నూతన అంగన్వాడీ భవనం తదితర నిర్మాణాలను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో చిరకాలంగా నెలకొన్న మౌలిక వసతుల కొరతను అధిగమించే దిశగా ఈ పనులు చేపట్టినట్లు అధికారులు, ప్రజాప్రతినిధులు తెలిపారు. వాడపల్లి ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్ )ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో భాగంగా గ్రామంలోని పలు ప్రాంతాల్లో సీసీ రహదారుల నిర్మాణం చేపట్టారు. ఇరుకైన వీధులు, వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉన్న ప్రాంతాల్లో సైతం ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకుని రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. రహదారుల అభివృద్ధితో రాకపోకలు సులభతరం కావడంతో పాటు వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులు కొంతమేర తగ్గే అవకాశం ఉందన్నారు.

### డ్రైనేజీ వ్యవస్థకు ప్రాధాన్యం

గ్రామాల్లో రహదారులతో పాటు పారిశుధ్య నిర్వహణకు దోహదపడే డ్రైనేజీ వ్యవస్థను పటిష్ఠం చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే సత్యానందరావు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆత్రేయపురంలో పలు ప్రాంతాల్లో డ్రైనేజీ నిర్మాణాలను చేపట్టినట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ, పారిశుధ్య నిర్వహణకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనులు కొనసాగుతున్నాయని వివరించారు.

### అంగన్వాడీ భవనం ప్రారంభం

చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సేవలందించే అంగన్వాడీ కేంద్రానికి నూతన భవనాన్ని ఏర్పాటు చేయడం ద్వారా మెరుగైన వసతులు కల్పించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం, ప్రాథమిక విద్య, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన సేవలు అందుతున్న నేపథ్యంలో సౌకర్యవంతమైన భవనాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

### రైతులకు యంత్ర పరికరాల అండ

వ్యవసాయ రంగంలో యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు కస్టమ్ హైరింగ్ సెంటర్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇందులో భాగంగా ట్రాక్టర్‌తో పాటు వ్యవసాయ అవసరాలకు వినియోగించే పలు పరికరాలను రైతులకు అందుబాటులో ఉంచారు. వ్యవసాయ యంత్రాలను వ్యక్తిగతంగా కొనుగోలు చేయలేని చిన్న, సన్నకారు రైతులకు కస్టమ్ హైరింగ్ సెంటర్ ద్వారా అద్దె ప్రాతిపదికన పరికరాలు అందుబాటులోకి రావడం ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు.

### ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పన

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ నిధులు కేటాయిస్తున్నట్లు ఎమ్మెల్యే సత్యానందరావు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహకారంతో కొత్తపేట నియోజకవర్గంలోని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్య క్రమంలో అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు వివరించారు. గ్రామాభివృద్ధి అంటే కేవలం సీసీ రహదారుల నిర్మాణానికే పరిమితం కాకుండా డ్రైనేజీ, పారిశుధ్యం, విద్య, వ్యవసాయం తదితర రంగాలకు సంబంధించిన సదుపాయాలను సమన్వయంతో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగా నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కూసంపూడి రామకృష్ణరాజు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లి మంగదేవి, ముదునూరి వెంకటరాజు, మండల నాయకులు, కార్యకర్తలు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద కనకదుర్గ అమ్మవారి దసరా మహోత్సవాలకు పందిరి రాట.

- పూజా కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ : ఉమ్మిడి.





**ఏలేశ్వరం, పెన్ పవర్, అక్టోబర్ 5:** ఏలేశ్వరం ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణంలో కొలువై ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారి దసరా మహోత్సవాలకు సోమవారం పందిరి రాట వేసే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త తంగేటి రామలక్ష్మి ఆహ్వానం మేరకు కాంగ్రెస్ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇంచార్జ్ ఉమ్మిడి వెంకట్రావు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఉమ్మిడి వెంకట్రావు దంపతులు పందిరి రాట కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించు కుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దసరా మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరగాలని ఆకాంక్షించారు. ఈ పూజ కార్యక్రమాలలో పండూరి రమణ పంతులు, ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణ, గిరిజ దంపతులు, ఊర కృష్ణమూర్తి, ముత్యాల రమేష్, పగలపాటి కామేష్, నమశ్శివాయ, ఇంద్ర, రాజా , భక్తులు పాల్గొన్నారు.

# టెక్నాలజీతో పాటు నైపుణ్యాల అభివృద్ధి ఎంతో అవసరం

- అకడమిక్ డైరెక్టర్ డా. బి.ఈ.వి.ఎల్. నాయుడు




**కాకినాడ, పెన్ పవర్,అక్టోబర్ 5:** స్థానిక ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో "టెక్ ఉత్సవ్--2026" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఫ్రాక్టల్ ఎనలిటిక్స్ సంస్థకు చెందిన పిల్లి వైష్ణవి,గీతా కళ్యాణి పూతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, నేటి డిగ్రీ విద్యార్థుల భవిష్యత్తులో టెక్నాలజీకి ఎంతో ప్రాధాన్యత ఉందని తెలిపారు.ఏఐ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు.అకడమిక్ డైరెక్టర్ డా. బి.ఈ.వి.ఎల్. నాయుడు మాట్లాడుతూ, టెక్నాలజీ పరిజ్ఞానంతో పాటు కమ్యూనికేషన్, ప్రాబ్లమ్ సాల్వింగ్, టీమ్‌వర్క్ వంటి నైపుణ్యాలు కూడా విద్యార్థులకు ఎంతో అవసరమని అన్నారు. డిగ్రీ విద్యతో పాటు ఈ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటే మంచి కెరీర్ అవకాశాలను పొందవచ్చని పేర్కొన్నారు."డిగ్రీ విద్య కేవలం ఒక సర్టిఫికేట్ కాదు; అది మన భవిష్యత్తుకు బలమైన పునాది. విద్యార్థులు తమ మూడు లేదా నాలుగు సంవత్సరాల విద్యా కాలాన్ని కేవలం పరీక్షల కోసం కాకుండా,జ్ఞానం, నైపుణ్యాలు,వ్యక్తిత్వ వికాసం కోసం ఉపయోగించుకోవాలి" అని డా. నాయుడు సూచించారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన కంప్యూటర్ సైన్స్ విభాగాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డా. నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డా. నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు.కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి వీఎస్ఎన్ కుమార్, ఏఐ డీన్ సిద్ధార్థ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మెర్లపాలెంలో జలజీవన్ మిషన్‌కు శ్రీకారం

- కొత్తపేట నియోజకవర్గంలో రూ.11.80 కోట్లతో తాగునీటి పనులు




**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 5:** గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. మెర్లపాలెంలో రక్షిత మంచినీటి పథకం నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. జలజీవన్ మిషన్, అమరజీవి జలధార కార్యక్రమాల ద్వారా ఇంటింటికీ కుళాయి ద్వారా సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యమన్నారు.పల్లె పండుగ--3.0లో భాగంగా కొత్తపేట నియోజకవర్గంలోని 16 ప్రాంతాల్లో తాగునీటి వసతుల కల్పనకు రూ.11.80 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఇప్పటికే పలు గ్రామాల్లో పనులకు టెండర్లు పిలిచి ప్రారంభించినట్లు పేర్కొన్నారు. జలజీవన్ మిషన్ కింద అసంపూర్తిగా ఉన్న 31 మంచినీటి ట్యాంకుల నిర్మాణాలను రానున్న రెండు, మూడు నెలల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు.తాగునీటి పథకాలతోపాటు గ్రామాల్లో సీసీ రహదారులు, డ్రైనేజీలు, గోకులాల నిర్మాణం తదితర అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు.

# అహోబిల ఆసుపత్రిలో ప్రతి ఆదివారం స్థూలకాయ నివారణపై ప్రత్యేక కార్యక్రమం




**డా. ఆదిత్య ఆధ్వర్యంలో అవగాహన సదస్సు**

కాకినాడ ,పెన్ పవర్,అక్టోబర్ 5: స్థానిక అహోబిల ఆసుపత్రిలో డా.ఆదిత్య ఆధ్వర్యంలో కాకినాడకు చెందిన ప్రముఖ వైద్యులతో స్థూలకాయం నివారణ, నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. స్థూలకాయ సమస్యతో బాధపడుతున్న వారికి వైద్యపరమైన సూచనలు,జీవనశైలి మార్పులపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డా.ఆదిత్య మాట్లాడుతూ.. స్థూలకాయాన్ని తగ్గించుకోవడానికి శాస్త్రీయంగా ఆమోదించబడిన చికిత్సా విధానాలు నిర్దిష్ట వైద్య సూత్రాలపై ఆధారపడి ఉంటాయని తెలిపారు.జీవనశైలి, ప్రవర్తనా మార్పులతో పాటు అవసరమైన వైద్య సహాయాన్ని అందించే సమగ్ర విధానం ద్వారా స్థూలకాయాన్ని నియంత్రించ వచ్చన్నారు. క్యాలరీల లోటు, సమతుల్య పోషకాహారం,తీసుకునే ఆహార పరిమాణాన్ని నియంత్రించుకోవడం ముఖ్యమని పేర్కొన్నారు.అలాగే అతిగా తినడానికి దారితీసే మానసిక,ప్రవర్తనా కారణాలను గుర్తించి వాటిపై దృష్టి సారించడం కూడా తమ వైద్య విధానంలో భాగమని తెలిపారు. స్థూలకాయ సమస్య పరిష్కారానికి అహోబిల ఆసుపత్రిలో ప్రతి ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రత్యేకంగా సేవలు అందించనున్నట్లు వెల్లడించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రోజుకు 7--8 గంటల నాణ్యమైన నిద్రకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మానసిక ఒత్తిడి కారణంగా కార్టిసోల్ హార్మోన్ స్థాయిలు పెరిగి పొత్తికడుపు చుట్టూ కొవ్వు పేరుకుపోయే అవకాశం ఉందన్నారు.స్థూలకాయం అనేది శరీరంలో అధికంగా కొవ్వు పేరుకుపోవడం వల్ల ఏర్పడే తీవ్రమైన ఆరోగ్య సమస్య అని, ఇది కేవలం బాహ్య రూపానికి సంబంధించిన అంశం మాత్రమే కాదని తెలిపారు.అనేక దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలకు స్థూలకాయం ఒక ముఖ్యమైన ప్రమాద కారకంగా మారుతుందని పేర్కొన్నారు.డా.అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ.. స్థూలకాయాన్ని తగ్గించుకోవడంలో ఆహార నియమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.ఆకుకూరలు,కూరగాయలు, తృణధాన్యాలు,మిల్లెట్స్, బ్రౌన్ రైస్ వంటి పీచు పదార్థాలు అధికంగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. పప్పుధాన్యాలు,గుడ్లు,పన్నీర్ వంటి ప్రోటీన్ కలిగిన ఆహారాన్ని సమతుల్యంగా తీసుకోవాలని కోరారు.పంచదార,కూల్‌డ్రింక్స్,వేపుళ్లు, ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలను వీలైనంత వరకు తగ్గించాలని,ప్రతిరోజూ యోగా లేదా వ్యాయామం చేయాలని సూచించారు. తగినంత నీరు తాగుతూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డా. శ్రీమన్నారాయణ,డా.రాజ్‌కుమార్,డా. మూర్తి,డా.చలం,డా.రావు నారాయణరావు,డా.సుష్మ,కాకినాడ సైక్లింగ్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జగ్గిరెడ్డి ఆరోపణలకు ఎమ్మెల్యే సత్యానందరావు కౌంటర్

**వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి.. నిరాధార ఆరోపణలు చేస్తే ప్రజలు నమ్మరు**






**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 5:** వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి తనపై చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. పల్లె పండుగ లో భాగంగా సోమవారం ఎమ్మెల్యే బండారు ఆత్రేయపురంలో వైసీపీ హయాంలో అసంపూర్తిగా నిర్మించిన హెల్త్ భవనాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. తలుపులు, కిటికీలు, ఫ్లోరింగ్ పూర్తికాకముందే గత ప్రభుత్వం హడావుడిగా ప్రారంభోత్సవం చేసిందని విమర్శించారు. ప్రస్తుతం ఫ్లోరింగ్ దెబ్బతిని భవనం నిరుపయోగంగా మారిందన్నారు.అమలాపురం రూరల్ ఇందుపల్లిలో రోడ్డు నిర్మాణంపై వస్తున్న ఆరోపణలపై స్పందిస్తూ.. బురద నేల, సాయిల్ కండిషన్ కారణంగా కొంత మేర రోడ్డు దిగబడిందని, వెంటనే కాంట్రాక్టర్‌తో మరమ్మతులు చేయించామని తెలిపారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రోడ్డు అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని, కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.1.20 కోట్లతో తొలి విడత పనులు చేపట్టామని పేర్కొన్నారు.ఆరోపణలు చేసే ముందు ఇందుపల్లి వెళ్లి ప్రజలను అడిగి వాస్తవాలు తెలుసుకోవాలని జగ్గిరెడ్డికి ఎమ్మెల్యే సూచించారు. మైక్ దొరికిందని ఇష్టానుసారంగా మాట్లాడితే ప్రజల్లో విశ్వసనీయత కోల్పోతారని అన్నారు.

# యర్రవరం అరటి మార్కెట్ యార్డులో ఘనంగా గణనాధుని అన్న ప్రసాద వితరణ.





**ఏలేశ్వరం, పెన్ పవర్, అక్టోబర్ 5:** మండల పరిధి యర్రవరం అరటి మార్కెట్ యార్డులో ఘనంగా గణనాధుని అన్నప్రసాద వితరణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. జాతీయ రహదారని అనుకోని ఉన్న అరటి మార్కెట్ యార్డ్ ఓనర్స్, వర్కర్స్ అద్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి సుమారు 5000 మంది భక్తులు అన్న ప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా మార్కెట్ సభ్యులు మాట్లాడుతూ వినాయకుని చవితి నవరాత్రి ఉత్సవాల నిర్వహణ, గణేష్ నిమజ్జనం అనంతరం ప్రతీ ఏటా అన్నసంతర్పణ కార్యక్రమాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నామని తెలిపారు. సుమారు 5వేల మంది భక్తులు ఈ అన్న ప్రసాదాని స్వీకరించారని ఆనందాన్ని వ్యక్తం చేశారు. అన్నసంతర్పణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.ఈ కార్యక్రమం లో అరటి మార్కెట్ ఓనర్స్ అండ్ వర్కర్స్, నాయకులు, గ్రామ పెద్దలు , మహిళలు పాల్గొన్నారు.

# వాడపల్లి ఆలయంలో వరుణ జపాలకు శ్రీకారం



**సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమం**

**రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల తో మంగళవారం నిర్వహణ**

**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 5:** కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మంగళవారం వరుణ జపాలు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ఉపకార్యనిర్వహణాధికారి నల్లం సూర్యచక్రధర్‌రావు తెలిపారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు కళకళలాడాలని, ప్రజలు సుఖసంతోషాలతో సుభిక్షంగా జీవించాలని ఆకాంక్షిస్తూ ఈ విశిష్ట కార్యక్రమానికి దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.వర్షాధార వ్యవసాయంపై ఆధారపడిన గ్రామీణ ప్రాంతాల్లో సకాలంలో వర్షాలు కురవడం అత్యంత కీలకమని, ప్రకృతి అనుకూల పరిస్థితులు నెలకొని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని ప్రార్థిస్తూ వరుణ దేవుడిని ఆరాధించే సంప్రదాయంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేద మంత్రోచ్చారణలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో వరుణ జపాలను శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. సుభిక్షం కోసం ప్రార్థనలు ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసి చెరువులు, కాలువలు, జలాశయాలు జలకళను సంతరించుకోవాలని, వ్యవసాయ రంగానికి అనుకూల పరిస్థితులు ఏర్పడాలని ఆకాంక్షిస్తూ వరుణ జపాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. భక్తిశ్రద్ధలతో జరిగే ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొననున్నారు.



# కాకినాడ పీఆర్ కళాశాలలో ఘనంగా పిఠాపురం రాజావారి 141వ జయంతి వేడుకలు

- రాజావారి సేవలు చిరస్మరణీయం
- ప్రిన్సిపాల్ డా. ఎం.వి.కె. మెహర్



**కాకినాడ పెన్ పవర్, అక్టోబర్ 5:** కాకినాడ పిఠాపురం రాజా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డా.ఎం.వి.కె. మెహర్ ఆధ్వర్యంలో రాజా రావు వెంకట కుమార మహీపతి సూర్యారావు బహదూర్ వారి 141వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కళాశాల పూర్వ విద్యార్థుల సంఘ నాయకులు, విద్యార్థినీ విద్యార్థులు,అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది,పుర ప్రముఖులు పాల్గొన్నారు.తొలుత స్థానిక జిల్లా పరిషత్ సెంటర్ వద్ద ఉన్న పీఆర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన రాజావారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.అనంతరం కళాశాల ప్రాంగణంలో ఉన్న రాజావారి తండ్రి గంగాధర రామారావు బహదూర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.తదుపరి కళాశాలలో ఏర్పాటు చేసిన జయంతి వేడుకల సమావేశంలో రాజావారు కాకినాడ పట్టణానికి చేసిన సేవలను,పీఆర్ విద్యాసంస్థల ఏర్పాటుకు అందించిన భూరి విరాళాలను, ఆయన దాతృత్వాన్ని పూర్వ విద్యార్థుల సంఘ నాయకులు బామిరెడ్డి,నరసరాజు, మూర్తి తదితరులు కొనియాడారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.వి.కె. మెహెర్ మాట్లాడుతూ, రాజావారు కళాశాలకు చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు.ఆయన నాటిన పీఆర్ విద్యాసంస్థలనే మహావృక్షం నీడన అనేకమంది విద్యార్థులు విద్యనభ్యసించి దేశ, విదేశాల్లో కీర్తి ప్రతిష్ఠలు సంపాదించారని పేర్కొన్నారు.రాజావారు అందించిన సేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ,రాబోయే తరాల విద్యార్థినీ విద్యార్థులు కూడా ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆయన ఆకాంక్షించారు.కళాశాల పూర్వ విద్యార్థుల సంఘంతో కలిసి కళాశాల అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని, అందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తామని ప్రిన్సిపాల్ డా.మెహర్ హామీ ఇచ్చారు.కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది,పూర్వ విద్యార్థులు,విద్యార్థినీ విద్యార్థులు,పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక జియోటెక్నికల్ ఇంజినీరింగ్‌పై ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్సు




### సుస్థిర మౌలిక వసతులపై నిపుణుల అవగాహన

**గండేపల్లి, (సూరంపాలెం), అక్టోబర్ 05:** గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో ఆధునిక జియోటెక్నికల్ ఇంజినీరింగ్, సుస్థిర మౌలిక వసతులపై ఐదు రోజుల ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్సు విజయవంతంగా ముగిసింది. ఆదిత్య యూనివర్సిటీ, ఆదిత్య లెర్నింగ్ అకాడమీ, సివిల్ ఇంజినీరింగ్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 3 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.
కోర్సులో విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు. స్ట్రక్చర్డ్ ఫుటింగ్స్, సైట్ ఇన్వెస్టిగేషన్, ఫౌండేషన్ సిఫార్సులు, పారిశ్రామిక వ్యర్థాలను సుస్థిరంగా వినియోగించడం, విస్తరణ చెందే నేలల నివారణ చర్యలు, జియో-నేచురల్ పదార్థాల వినియోగం తదితర ఆధునిక అంశాలపై నిపుణులు అవగాహన కల్పించారు. జియోటెక్నికల్ ఇంజినీరింగ్ రంగంలో తమ పరిశోధన అనుభవాలను డా. టి. జ్ఞానానందరావు, డా. ఎస్. ఆనందకుమార్, డా. చ. అజయ్ తదితరులు పంచుకున్నారు.
కార్యక్రమ నిర్వహణకు సహకరించిన డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్ డా. ఎం.బి. శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ (అకడమిక్) డా. ఎస్. రమాశ్రీ, ప్రో వైస్ ఛాన్సలర్ (ఇంజినీరింగ్ అండ్ సైన్స్) డా. ఎ. రమేష్, రిజిస్ట్రార్ డా. జి. సురేష్‌లకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. వారి ప్రోత్సాహంతో విద్యా, పరిశోధన రంగాల్లో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.ఆదిత్య లెర్నింగ్ అకాడమీ కోఆర్డినేటర్ డా. ఐ. వీరాంజనేయులు, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డా. బి. రామ్మోహన్ రెడ్డి, అకాడమీ సభ్యుడు శ్రీ బి. మహేశ్వరరావుతో పాటు వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. నిర్దేశిత హాజరు, పరీక్షా ప్రమాణాలను పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## నృత్య పోటీల్లో నేతాజీ స్కూల్ విద్యార్థినికి తృతీయ బహుమతి




**ఆలమూరు, పెన్ పవర్ అక్టోబర్ 05:** రాజమహేంద్రవరంలో ఆర్ట్స్ కళాశాలలో తరుణీ తరంగణీ దసరా మహిళా సంస్కృతికోత్సవాల్లో భాగంగా ఆదివారం ఘనంగా నిర్వహించిన ప్రాంతీయ స్థాయి శాస్త్రీయ నృత్య పోటీలలో మండలంలోని చెముడులంక నేతాజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థిని గుండుబోగుల దివ్య శ్రీ అద్భుత ప్రతిభ కనబరిచి తృతీయ (3వ) బహుమతి కైవసం చేసుకున్నట్లు పాఠశాల డైరెక్టర్ తుమ్మ శ్రీనివాస్,ప్రిన్సిపాల్ లంకలపల్లి మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు.వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన ప్రతిభావంతులైన నృత్య కళాకారులతో పోటీపడి దివ్య శ్రీ ఈ బహుమతిని సాధించడం విశేషం అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం మూలస్థానం గ్రామానికి చెందిన విద్యార్థిని దివ్య శ్రీని, ఆమె తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందించారు.చిరుప్రాయంలోనే శాస్త్రీయ నృత్యంలో ప్రతిభ చాటి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తెచ్చిపెట్టిన దివ్య శ్రీ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఆమె కళా ప్రతిభ మరింతగా వికసించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,తోటి విద్యార్థులు మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

## పెండింగ్ రెవెన్యూ కేసులను గడువులోగా పరిష్కరించాలి






**కాకినాడ, పెన్ పవర్,అక్టోబర్ 5:** భూ పరిపాలన, రీసర్వే, భూ రికార్డులు, రెవెన్యూ సేవలపై ప్రత్యేక దృష్టి సారించి, పెండింగ్ కేసులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి ఆర్డీవోలు, తహసీల్దార్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన జిల్లాలోని రెవెన్యూ అంశాలపై సమీక్షించారు. పీజీఆర్ఎస్ రీ-ఓపెన్ కేసులు, గెట్ టు బి అర్జీలు, 22ఏ నిషేధిత భూముల కేసులు, ఆన్‌లైన్ రెవెన్యూ కేసుల పెండెన్సీని ప్రాధాన్యతతో పరిష్కరించాలని సూచించారు. భూ రీసర్వేను వేగవంతం చేసి, పట్టాదారు పాస్‌పుస్తకాల ముద్రణ, పంపిణీ పూర్తి చేయాలని, డేటా ఎంట్రీ పెండెన్సీ లేకుండా డీఎల్ఆర్, ఈ-కేవైసీ ప్రక్రియలను పూర్తి చేయాలని ఆదేశించారు. వెబ్‌ల్యాండ్‌లో రికార్డుల సవరణలను జాగ్రత్తగా చేపట్టి, భూహక్కులు సక్రమంగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు మీ-సేవ ద్వారా అందుతున్న రెవెన్యూ సేవల నాణ్యతను పర్యవేక్షించాలని సూచించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించి జీరో పెండెన్సీ సాధించాలని, ఎన్‌జీఎస్‌పీ పోర్టల్‌పై నిరంతర సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. ప్రజా సంతృప్తి, పారదర్శకత, జవాబుదారీతనంతో అధికారులు పనిచేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో డీఆర్వో డాక్టర్ డి. తిప్పే నాయక్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## సిబ్బంది మ్యాపింగ్‌ను రెండు రోజుల్లో పూర్తి చేయాలి



**కాకినాడ, పెన్ పవర్,అక్టోబర్ 5:** ఐ గాట్ కర్మయోగికి సంబంధించి కాకినాడ జిల్లాలో ప్రభుత్వ సిబ్బంది మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసి, మిగిలిన మ్యాపింగ్‌ను రెండు రోజుల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని మొత్తం 21 వేల మంది సిబ్బందిలో ఇప్పటివరకు 8 వేల మంది (39 శాతం) మ్యాపింగ్ పూర్తయిందన్నారు. మిగిలిన 13 వేల మంది మ్యాపింగ్‌ను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో 1,325 మంది, 3వ బెటాలియన్ ఏపీఎస్పీలో 830 మంది, ఆర్టీసీలో 450 మంది, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ పరిధిలో 281 మంది మ్యాపింగ్ పెండింగ్‌లో ఉందని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, జిల్లాస్థాయి అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుంది: బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి.





**ఏలేశ్వరం, పెన్ పవర్,అక్టోబర్5:** రైతు సంక్షేమ ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్ అన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని లింగంపర్తి గ్రామంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షులు కంద వీరస్వామి ఆధ్వర్యంలో లింగంపర్తి నంది సెంటర్ వద్ద రైతు సేవా సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రవి కిరణ్ మాట్లాడుతూ రైతు సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందని, రైతులు కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ సబ్సిడీ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఫసలి భీమా యోజన,కిసాన్ సమ్మాన్ నిధి ,ఎరువుల సబ్సిడీ,కిసాన్ క్రెడిట్ కార్డులను రైతులు ఉపయోగించుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు ధనరాజ్, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శులు కుమార్ స్వామి, మణికంఠ,మండల అధ్యక్షులు నీలి సురేష్,పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు ఉషారాణి, గరికి నాగు, కొల్లా శ్రీనివాస్, గట్టెం వెంకట రమణ, గొల్లపూడి సత్యనారాయణ, వ్యవసాయ శాఖ సిబ్బంది, కురాకుల రాజా, విజయ థామస్, రైతులు పాల్గొన్నారు.

## తలుపులమ్మ అమ్మవారి సన్నిధిలో వరుణ యాగం

### సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలతో రాష్ట్రం సస్యశ్యామలం కావాలని ప్రత్యేక పూజలు

**పెన్ పవర్ ప్రతినిధి కాకినాడ జిల్లా (లోవ) అక్టోబర్ 05:** కాకినాడ జిల్లా తుని మండలం లావణ్య గ్రామంలో కొలువై ఉన్న శ్రీ తలుపులమ్మ అమ్మవారి సన్నిధిలో రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల ఆదేశాల మేరకు నేడు మంగళవారం (అక్టోబర్ 6) వరుణ యాగం, వరుణ జపం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు.రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని, గ్రామాలు సస్యశ్యామలంగా మారాలని, ప్రజలు సిరిసంపదలతో సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.ఆలయ కార్యనిర్వహణ అధికారి, ధర్మకర్తల మండలి అధ్యక్షుల పర్యవేక్షణలో కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేశారు. వేద పండితుల ఆధ్వర్యంలో దేవతా మండపారాధన, అభిషేకం, హోమం, వరుణ జపం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన సౌకర్యాలను కల్పించినట్లు అధికారులు తెలిపారు. ఆలయ సిబ్బంది, సేవకులు భక్తులకు సేవలు అందించేందుకు సిద్ధంగా ఉంటారని పేర్కొన్నారు.

## ఎంపీ శ్రీ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు విజ్ఞాన విహారయాత్ర.



**ఏలేశ్వరం, పెన్ పవర్,అక్టోబర్ 5:** మండల పరిధి యర్రవరం గ్రామంలో పి.ఎం.శ్రీ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆదివారం కాకినాడ జిల్లాలోని ప్రముఖ చారిత్రక,విద్య మరియు పర్యావరణ కేంద్రాలకు విజ్ఞాన విహారయాత్ర (ఎక్స్‌పోజర్ విజిట్)ను ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఎన్. కన్నబాబు సోమవారం తెలియజేశారు.కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పి.ఎం.శ్రీ కార్యక్రమంలో భాగమైన ప్రాయోగిక అభ్యసనలో భాగంగా ఈ పర్యటనను ఏర్పాటు చేశారు.ఈ యాత్రలో భాగంగా విద్యార్థులు వివిధ ప్రాంతాలను సందర్శించి ఆచరణాత్మక అవగాహన పెంపొందించుకున్నారు.కోరింగ మ్యాంగ్రోవ్ అడవులు పర్యావరణ వ్యవస్థ,జీవ వైవిధ్యం మరియు ఉప్పుపొద అడవుల సంరక్షణ ప్రాముఖ్యతను విద్యార్థులు ప్రత్యక్షంగా చూసి తెలుసు కొన్నారు. జేఎన్టీయూ కాకినాడ ఉన్నత విద్య,ఇంజనీరింగ్ రంగంలో పరిశోధనలు , భవిష్యత్తు కెరీర్ అవకాశాలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు.రంగరాయ మెడికల్ కాలేజ్ వైద్య విద్య,ఆరోగ్య సేవలు , వైద్య రంగంలో ప్రవేశానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పొందారు.శిల్పారామం ఆంధ్రప్రదేశ్ సాంప్రదాయ కళలు,సంస్కృతి మరియు హస్తకళల విశిష్టతను విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు.గాంధీ భవన్,మహాత్మా గాంధీజీ జీవిత విశేషాలు,ఆయన బోధించిన ఆదర్శాలు మరియు దేశభక్తి విలువల గురించి విద్యార్థులు నేర్చుకున్నారు.పాఠశాల ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థుల భద్రత,క్రమశిక్షణతో ఈ పర్యటన దిగ్విజయంగా పూర్తయినట్లు హెచ్ఎం తెలిపారు. తరగతి గది విద్యతో పాటు ఇటువంటి ప్రత్యక్ష పరిశీలన యాత్రలు విద్యార్థుల మానసిక వికాసానికి,భవిష్యత్తు లక్ష్యాల నిర్దేశానికి ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# సాంకేతిక, వృత్తి నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో ఉద్యానవన సాంకేతికతపై క్షేత్రస్థాయి విద్యార్థులతో అవగాహన....



**శంఖవరం పెన్ పవర్ అక్టోబర్ 05 :–** ఆధునిక వ్యవసాయంలో నాణ్యమైన పంటలను పండించడానికి, పంటల దిగుబడి, ఉత్పత్తిని పెంచడానికి ఉద్యానవన సాంకేతికత (హార్టికల్చర్ టెక్నాలజీ) ఎంతో కీలకం. సంప్రదాయ పద్ధతుల స్థానంలో అధునాతన సాంకేతికతను క్షేత్ర స్థాయిలో (పొలాల్లో) ఎలా ఉపయోగిస్తారు అనేది అందరికీ ఆసక్తి కలిగించే అంశం. ఈ ఆసక్తితోనే ఉద్యానవన సాంకేతికతపై క్షేత్రస్థాయి సదవగాహన (ఫీల్డ్ లెవెల్ అవేర్ నెస్) పెంచుకునేందుకు, ఉద్యానవన సాంకేతికతను అధ్యయనం చేయడానికి నేటి తరం విద్యార్థులు అత్యంత ఆసక్తి చూపుతున్నారు. విద్యార్థులను కేవలం పాఠ్య పుస్తకాల పరిజ్ఞానానికే పరిమితం చేయకుండా సాంకేతిక, వృత్తి నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో ఉద్యానవన సాంకేతికతపై క్షేత్రస్థాయి సదవగాహనా యాత్రలను పాఠశాలల యాజమాన్యాలు ప్రోత్సాహిస్తున్నాయి. ఎప్పుడూ ఆధునిక, తాజా సాంకేతిక అంశాలను తమ విద్యార్థులకు నేర్పాలనే తపన పడే కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజక వర్గంలోని మండల కేంద్రం శంఖవరంలోని జిల్లా ప్రజా పరిషత్తు ఉన్నత పాఠశాల (పిఎంశ్రీ) యాజమాన్యం ఉద్యానవన సాంకేతికతపై క్షేత్రస్థాయి సదవగాహన విజ్ఞాన యాత్రను ఆదివారం నిర్వహించింది. 9,10వ తరగతుల 75 మంది విద్యార్థులు అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ నర్సరీని, పామాయిల్ తోటలను క్షేత్రస్థాయి అధ్యయనంలో భాగంగా సందర్శించారు.

**విద్యార్థులు ప్రత్యక్షంగా పరిశీలించిన అంశాలు**

ఈ సందర్భంగా నర్సరీ ప్రతినిధులు, వృత్తి విద్యా శిక్షకుల మార్గదర్శకత్వంలో విద్యార్థులు పలూ సాంకేతిక అంశాలను క్షేత్రస్థాయిలో తెలుసు కున్నారు. నాణ్యమైన నారు పెంపకం, విత్తన శుద్ధి విధానాలు, మొలక శాతం పెంచే జాగ్రత్తలు, ఆరోగ్యకరమైన నారు పెంచే పద్ధతులను తెలుసు కున్నారు. అలాగే మొక్కలు పెంపకానికి మట్టికి ప్రత్యామ్నాయంగా కొబ్బరి పీచు ఆధారిత కోకోపీట్‌ను వినియోగిస్తూ ప్రో ట్రేలలో రోగరహిత వాతావరణంలో నారు తయారు చేయడంపై అవగాహన పెంచుకున్నారు. పాలీ హౌస్‌లు, షేడ్ నెట్ల(గ్రీన్ హౌస్)ల ఉష్ణోగ్రత, తేమను నియంత్రిస్తూ మొక్కలను సంరక్షించే రక్షిత సేద్యం (ప్రొటెక్టెడ్ కల్టివేషన్) విధానాలు, నీటి వృథాను అరికట్టే బిందు సేద్యం (డ్రిప్ ఇరిగేషన్), తుంపర సేద్యం పద్ధతులపై విద్యార్థులు అవగాహన పెంచుకున్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసిన నర్సరీ యాజమాన్యానికి పాఠశాల బృందం కృతజ్ఞతలు తెలిపింది.

**వృత్తి విద్యా కోర్సుల ప్రాముఖ్యత**

ఈ సందర్భన సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొమ్మిశెట్టి జగ్గారావు మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వృత్తి విద్యా కోర్సులు (వొకేషనల్ కోర్సెస్) విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతగానో దోహద పడతాయి అన్నారు. తరగతి గదిలో సిద్ధాంత పరంగా నేర్చుకున్న అంశాలను ఇలా క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించడం వల్ల విద్యార్థులకు ఆ విషయాలపై సంపూర్ణ అవగాహన, ఆసక్తి పెరుగుతాయని పేర్కొన్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ఉద్యానవన నిర్వహణపై నైపుణ్యం సాధించడంతో విద్యార్థులు భవిష్యత్తులో స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించు కోవడమే కాకుండా, నూతన సాంకేతికతను సమాజానికి ఉపయోగపడేలా చేయగలరు" అని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.జగ్గారావు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, వృత్తి విద్యా శిక్షకులైన అగ్రికల్చర్ ట్రైనర్ మాధురి, ఆటోమోటివ్ ట్రైనర్ మణికంత, బ్యాంకింగ్ ట్రైనర్ పార్వతి, జి.సరస్వతి, ఎన్.శ్రీనివాసు పాల్గొన్నారు.

# ఐసీఏఐలో కెరీర్ అవకాశాలపై అవగాహన




**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 5:** జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చెన్నారావు ఆధ్వర్యంలో వాణిజ్యశాస్త్ర విభాగం ఇన్చార్జి డాక్టర్ జి.సురేష్ సమన్వయంతో విద్యార్థులకు ఇన్స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియాలో కెరీర్ అవకాశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాకినాడకు చెందిన చార్టర్డ్ అకౌంటెంట్ జి. శ్రవణ్ కుమార్ వనరుల వ్యక్తిగా హాజరయ్యారు. ఐసిఏఐ ప్రాముఖ్యత, చార్టర్డ్ అకౌంటెన్సీ ద్వారా లభించే ఉద్యోగ, వృత్తిపరమైన అవకాశాలపై మాట్లాడారు. చార్టర్డ్ అకౌంటెన్సీ కోర్సు విధానం, పరీక్షల స్వరూపం, కెరీర్ అవకాశాల గురించి సమగ్రంగా వివరించారు. ఈ కోర్సులో విద్యార్థులు ఎదుర్కొనే వివిధ సమస్యలు, సవాళ్లను వివరించడంతో పాటు వాటిని అధిగమించడానికి అవసరమైన ప్రణాళిక, సమయపాలన, నిరంతర సాధన, ఏకాగ్రత వంటి అంశాలపై విలువైన సూచనలు అందించారు.

# ఆలమూరు శ్రీ రాఘవేంద్ర విద్యార్థి జాతీయస్థాయి కుంగ్ ఫూ కరాటే పోటీల్లో ప్రతిభ



**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 05:**రాజమండ్రి శ్రీకృష్ణ శ్రీసాయి కళ్యాణ మండపంలో జరిగిన ఓపెన్ సెకండ్ జాతీయస్థాయి కుంగ్ ఫూ కరాటే పోటీలో ఆలమూరు శ్రీ రాఘవేంద్ర విద్యార్థి కె.మోక్షజ్ఞ 9వ తరగతి ప్రతిభ కనబరిచి సబ్ జూనియర్ కేటగిరిలో ప్రథమ స్థానం సాధించాడు. ఈ సందర్భంగా శ్రీ రాఘవేంద్ర ఉపాధ్యాయ బృందం, స్కూల్ కరెస్పాండంట్ ఎన్. ఆదినారాయణ మూర్తి విద్యార్థి ని అతను తల్లిదండ్రులు ను ప్రత్యేకంగా అభినందించారు. కుంగు ఫూ కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తెచ్చిపెట్టిన కె. మోక్షజ్ఞ ను అభినందించి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,తోటి విద్యార్థులు మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

# రెండు సామాజిక వర్గాల మధ్య సోదరభావం కోసం మాత్రమే వెళ్లాను

- రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు



**అంబాజీపేట, పెన్ పవర్, అక్టోబరు 5:**ఇటీవల రావులమ్మ తల్లి ఆలయం సమీపంలో రెండు సామాజిక వర్గాల మధ్య జరిగిన వివాదం, అనంతరం చోటుచేసుకున్న ఘర్షణ, కేసులు, అరెస్టులు, రిమాండ్ వంటి పరిణామాలు అందరికీ తెలిసినవే. ఈ ఘటనలో ఇరువర్గాలకు చెందిన కొందరు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందడంతో పాటు, పోలీస్ కేసులు, ఎఫ్ఐఆర్‌లు నమోదు కావడం జరిగిందని వారిని పరామర్శించి రెండు సాజిక వర్గాల మధ్య సయోధ్య కు వెళ్ళానని సోమవారం ఆయన స్వగృహంలో జరిగిన విలేఖరుల సమావేశంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు అన్నారు. విలేఖరులు తో మాట్లాడుతూ నేను వైసిపి నాయకులతో అంటకాగుతున్నట్లుగా కొంతమంది దృష్ప్రచారం చేస్తున్నారని సామాజక వర్గ కార్యకర్తగా, ఆయా వర్గాలకు చెందిన పలువురితో నాకు గతం నుంచే పరిచయాలు ఉన్నందున, పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా కాకుండా చూడాలనే సదుద్దేశంతో వారిని పరామర్శించేందుకు వెళ్లాను. ఇరువర్గాల మధ్య భవిష్యత్తులో ఎలాంటి గొడవలు జరగకుండా, అన్నదమ్ముల్లా సోదరభావంతో కలిసి మెలిసి ఉండేలా పెద్దల సమక్షంలో మాట్లాడుకోవాలనే ఉద్దేశంతోనే అక్కడికి వెళ్లడం జరిగిందని ఉన్నారు. కూటమి ప్రభుత్వానికి, పార్టీ నాయకత్వానికి కట్టుబడి పనిచేస్తూ, ప్రజల మధ్య ఐక్యత, సోదరభావం, సామరస్యాన్ని పెంపొందించేందుకు నా వంతు కృషి చేస్తాను. రెండు సామాజిక వర్గాల మధ్య విభేదాలు తొలగిపోయి, గతంలో మాదిరిగానే అందరూ కలిసి మెలిసి ఉండాలన్నదే నా అభిమతమన్నారు. నేను అక్కడ ఉన్న సమయంలో అనుకోకుండా ఎమ్మెల్సీ కుడుపైడి సూర్యనారాయణరావు, కొందరు విలేకరులు రావడం జరిగింది. వారి వెంట వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్, మట్టపర్తి మీరాసాహెశెట్ట తదితరులు కూడా వచ్చారు. ఆ సమయంలో తీసిన ఒక ఫొటోను కొంతమంది వ్యక్తులు నా పై వేరే విధంగా ప్రచారం చేస్తున్నట్లు నా దృష్టికి వచ్చింది. ఆ ఫొటోకు, అనంతరం జరిగిన పరిణామాలకు నాకు ఎలాంటి సంబంధం లేదని తెలియజేస్తున్నాను అన్నారు. నేను కేవలం ఒక సామాజిక కార్యకర్తగా, రెండు వర్గాల మధ్య సఖ్యత నెలకొల్పాలనే సదుద్దేశంతోనే అక్కడికి వెళ్లాను. ఎవరి రాజకీయ ప్రయోజనాల కోసం గానీ, ఏ ఒక్క వర్గానికి అనుకూలంగా గానీ నేను అక్కడికి వెళ్లలేదు. ఈ విషయాన్ని ప్రజలు, నాయకులు, అన్ని సామాజిక వర్గాల పెద్దలకు మీద్వారా తెలియపర్చాలని విలేఖర్ల సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు

# బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు స్థానిక సంస్థ ఎన్నికల్లో అమలు చేయాలి



**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 5:** బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు స్థానిక సంస్థ ఎన్నికల్లో అమలు చేయాలని బహుజన సమాజ్ పార్టీ కాకినాడ జిల్లా అడ్వైజర్ జుత్తుక నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. జగ్గంపేట బహుజన్ సమాజ్ పార్టీ ఆఫీసులో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు బీసీలకు 50శాతం రిజర్వేషన్ ఇస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేశారు. ఇప్పుడు ఆ వాగ్దానాలను పక్కకి నెట్టు వేసి ఇచ్చిన మాటను నెరవేర్చకుండా బీసీలకు అన్యాయం చేస్తున్నారు. ఇచ్చిన హామీలను అమలు కాకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లడం సరికాదన్నారు. రాజ్యాంగంలో ఆర్టికల్ 9 షెడ్యూల్ లో చేర్చి రక్షణ కల్పించే దిశగా ప్రభుత్వం ముందుకు రావలసిన అవసరం ఎంతైనా ఉంది ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు పరచాలని ఆయన అన్నారు. బీసీలకు న్యాయం జరిగే వరకూ బహుజన సమాజ్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అబ్బులు, డేవిడ్ రాజు పాల్గొన్నారు.

# గర్భిణీలకు సామూహిక సీమంతాలు



- ఆడపడుచులకు సారె పెట్టిన చిన్నబాబు
- అంగన్వాడీ కార్యకర్తల సేవలకు అభినందన

**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 05:**పండంటి బిడ్డలకు జన్మనివ్వబోతున్న ఆడపడుచులను సొంత కుటుంబ సభ్యులుగా భావించి వారికి ఆత్మీయతను పంచుతూ సామూహిక సీమంత కార్యక్రమాన్ని నిర్వహించారు టీడీపీ సీనియర్ నాయకులు, వెంకటేశ్వర సంస్థల అధినేత ఈదర చిన్నబాబు. ప్రధాని మోదీ జన్మదినోత్సవ మహోత్సవాలు, సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా కొత్తపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ ఏ.గజలక్ష్మి సూచనల మేరకు, ఐసీడీఎస్ సూపర్వైజర్ నాగ సత్యవేణి ఆధ్వర్యంలో పెనికేరు గ్రామంలో అంగన్వాడీల అభినందన ఉత్సవం, గర్భిణుల సీమంతోత్సవాన్ని ఈదర చిన్నబాబు సమక్షంలో ఘనంగా నిర్వహించారు. పెనికేరు గ్రామంలోని ఐదు అంగన్వాడీ కేంద్రాలకు చెందిన 18 మంది గర్భిణులకు ఈ సందర్భంగా సీమంతాలు నిర్వహించారు. గర్భిణులను ఆడపడుచులుగా భావించి చిన్నబాబు సమకూర్చిన చీర, గాజులు, పసుపు, కుంకుమ, పూలతో సత్కరించి ఆత్మీయంగా ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంతో గర్భిణుల కుటుంబాల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. ఈ సందర్భంగా ఈదర చిన్నబాబు మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యకరమైన, పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. తల్లి ఆరోగ్యమే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యానికి పునాది అని, గర్భధారణ సమయంలో పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. మాతా శిశు సంరక్షణపై తల్లులకు పలు సూచనలు చేశారు. గర్భధారణ దశ నుంచి ప్రసవం వరకు ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలు, టీకాలు, ఇతర సదుపాయాలను ప్రతి గర్భిణీ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ప్రసవం అనంతరం పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపించి, అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యాభ్యాసం చేయించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఆడపడుచులు ఎలాంటి అవసరం వచ్చినా తనను సొంత సోదరుడిలా భావించాలని, వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఈ సందర్భంగా చిన్నబాబు భరోసా ఇచ్చారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అంగన్వాడీ కార్యకర్తల సేవలను గుర్తిస్తూ అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతల సంక్షేమంలో అంగన్వాడీ సిబ్బంది అందిస్తున్న సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 21న జగ్గంపేటలో మెగా రక్తదాన శిబిరం

**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 5:** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న 500 మందితో మెగా రక్తదాన శిబిరం జగ్గంపేటలో నిర్వహించనున్నట్లు జగ్గంపేట నియోజకవర్గం ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి పాటంశెట్టి సూర్య చంద్ర తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్కరణ దినోత్సవం సందర్భంగా కేవలం నివాళులు అర్పించడంతోనే ఆగిపోకుండా వారి త్యాగస్ఫూర్తితో ప్రజల ప్రాణాలను కాపాడే సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలనే ఉద్దేశంతో ఈ మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జగ్గంపేట నియోజకవర్గంలో వెయ్యి మంది రక్తదాతలతో ప్రత్యేక బ్లడ్ డోనర్స్ గ్రూపును ఏర్పాటు చేయనున్నట్లు సూర్యచంద్ర వెల్లడించారు. యువత, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో ముందుకు వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూర్యచంద్ర కోరారు.

# ఏలేశ్వరంలో వైసీపీ ఇంటింటి ప్రచారంలో ముద్రగడ.







**ఏలేశ్వరం, పెన్ పవర్, అక్టోబర్ 5:** పట్టణంలో వైసిపి సోమవారం సోమవారం నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి ఇన్చార్జ్ ముద్రగడ గిరిబాబు పాల్గొన్నారు.పట్టణంలోని 17వ వార్డులో నిర్వహిస్తున్న ప్రచారంలో గిరిబాబు తో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటి వద్ద గిరిబాబు ప్రజలకు అభివాదం చేస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మీ ఓటు వేసి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ ప్రచారంలో ముద్రగడ గిరిబాబుకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా ప్రచార కార్యక్రమంలో గిరిబాబు మాట్లాడుతూ వైయస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందని, రాష్ట్రంలో మళ్లీ జగనన్న పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని గిరిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు శిడగం వెంకటేశ్వరరావు, సామంతుల సూర్య కుమార్, సుంకర రాంబాబు, కోరాడ ప్రసాద్, వాగు బలరాం,పైల విజయ్, రాచర్ల రమేష్, సిరిపరుపు రాజేష్, ఇజనగిరి ప్రసాద్, గొడుగు నాగేంద్ర, ముద్రగడ వీరేంద్ర, గోళ్ళ నాగేశ్వరరావు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కముజువారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా మాస ఉత్సవం





**గర్భిణులు, బాలింతలు, చిన్నారుల పోషణపై అవగాహన**

**కొత్తపేట, పెన్ పవర్, అక్టోబర్ 5:** చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలతో పాటు గర్భిణులు, బాలింతల సంక్షేమానికి అంగన్‌వాడీ కేంద్రాలు అందిస్తున్న సేవలు ఎంతో కీలకమని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. కొత్తపేట మండలం ఐసీడీఎస్ పరిధిలోని వానపల్లి సెక్టార్ బిళ్లకుర్రు కముజువారిపాలెం 123వ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా మాస ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.సీడీపీఓ గజలక్ష్మి ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ పెద్దలు కముజు గంగాధర్‌రావు, చిట్టూరి వెంకటరెడ్డి, దంగేటి బాలరాజు, పాటి ఈశ్వరరావు, కముజు శ్రీనివాసరావు, చిట్టూరి నాగేశ్వరరావు,కొవ్వూరి శ్రీనివాసరావు, గంజా నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారుల తల్లులు, గర్భిణులు, బాలింతలు కార్యక్రమానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార సేవలపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. చిన్నారులకు వయసుకు తగిన పోషకాహారం అందించడం ద్వారా పోషకాహార లోపాలను నివారించవచ్చని తెలిపారు.

**చిన్నారులకు అన్నప్రాసన**

మాస ఉత్సవంలో భాగంగా చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ సిబ్బంది, తల్లిదండ్రుల సమక్షంలో చిన్నారులకు అన్నప్రాసన చేయించి, వారి ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పిల్లలకు పరిశుభ్రమైన, పోషక విలువలు కలిగిన ఆహారాన్ని వయసుకు అనుగుణంగా అందించాలని అవగాహన కల్పించారు.

**గర్భిణులకు సీమంతం.. తల్లులకు సన్మానం**

మహిళల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా గర్భిణులకు సీమంత కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భధారణ సమయంలో తగిన పోషకాహారం, వైద్య పరీక్షలు, విశ్రాంతి అవసరమని, ప్రసవానికి ముందు--తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.అలాగే చిన్నారుల సంరక్షణలో తల్లుల పాత్రను గుర్తిస్తూ గ్రామ పెద్దలు తల్లులను సన్మానించి గౌరవించారు. తల్లులు పిల్లల ఆరోగ్యం, పరిశుభ్రత, టీకాలు, ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందించే సేవలను సద్వినియోగం చేసుకుని పిల్లల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాలు కేవలం పౌష్టికాహారం అందించే కేంద్రాలే కాకుండా శిశు సంరక్షణ, ప్రాథమిక విద్య, తల్లి--శిశు ఆరోగ్యం, పోషణ, మహిళా సంక్షేమానికి వారధిగా పనిచేస్తున్నాయని గ్రామ పెద్దలు పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి అంగన్‌వాడీ కార్యకర్త కాకర నిర్మలకుమారి,ఆయా డి. దుర్గాలక్ష్మి ఆధ్వర్యం వహించారు. గ్రామ పెద్దలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

# జగన్నాధగిరిలో ఘనంగా అంగన్వాడీ మాసోత్సవం





- అంగన్వాడీ సేవలపై విస్తృత అవగాహన
- అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం
- గర్భిణీలకు సామూహిక సీమంతాలు
- పోషకాహారంపై అవగాహన

**కాజులూరు, పెన్ పవర్, అక్టోబర్ 5:**కాజులూరు మండలం జగన్నాధగిరిలో అంగన్వాడీ మాసోత్సవ కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. జగన్నాధగిరి ఎంపీపీ పాఠశాల ప్రాంగణంలో సోమవారం సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా అంగన్వాడీ ఉత్సవాన్ని నిర్వహించారు. తాళ్లరేవు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో వై. శ్రీదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, ఐసీడీఎస్ అధికారులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న వివిధ సేవలను తల్లులు, ప్రజాప్రతినిధులు, ప్రజలకు మరింత చేరువ చేయడం, కేంద్రాల సేవలపై అవగాహన కల్పించడమే అంగన్వాడీ ఉత్సవం ప్రధాన ఉద్దేశమని సీడీపీవో వై. శ్రీదేవి తెలిపారు. ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, శిశు సంరక్షణ, ప్రాథమిక విద్య తదితర సేవలను వివరించారు.

**పోషకాహారంపై అవగాహన**

గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. తల్లి, శిశు ఆరోగ్య పరిరక్షణలో పోషకాహారం కీలక పాత్ర పోషిస్తుందని, చిన్నారుల ఎదుగుదల, ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు అంగన్వాడీ కేంద్రాలు అందిస్తున్న సేవలను ప్రతి కుటుంబం వినియోగించుకోవాలని తెలిపారు.అంగన్వాడీ కేంద్రాలు కేవలం పౌష్టికాహారం అందించే కేంద్రాలుగానే కాకుండా శిశు సంరక్షణ, ఆరోగ్య అవగాహన, ప్రాథమిక విద్య, తల్లి--శిశు సంక్షేమానికి సంబంధించిన సేవలకు కేంద్రాలుగా పనిచేస్తున్నాయని వివరించారు.

**ఉత్తమ సేవలకు అవార్డులు**

అంగన్వాడీ సేవల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నేకూరి అరుణ, వీవీఎస్ నాగమ్మ, వి. వీరలక్ష్మి, పి. సూర్యకుమారిలకు బీజేపీ నాయకుల చేతుల మీదుగా బెస్ట్ అంగన్వాడీ అవార్డులను అందజేశారు. అవార్డు గ్రహీతలను ఐసీడీఎస్ అధికారులు, బీజేపీ నాయకులు అభినందించి, భవిష్యత్తులో మరింత సమర్థవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు.గర్భిణీలకు సామూహిక సీమంతాలు

అంగన్వాడీ మాసోత్సవంలో భాగంగా గర్భిణీ స్త్రీలకు సామూహిక సీమంతాల కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణీలను ఆశీర్వదిస్తూ, తల్లి--బిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు అవసరమైన జాగ్రత్తలు, పోషకాహారంపై అవగాహన కల్పించారు. మహిళలు, అంగన్వాడీ సిబ్బంది ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సలాది వీరబాబు, బీజేపీ మండల అధ్యక్షుడు పుణ్యమంతుల శివాజీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కె. రమణి, పి. శ్రీరామలక్ష్మి, వరలక్ష్మి, వసంత, పద్మావతి, ఎస్. మంగోజీ, నాగరత్నం, అమ్ములు తదితర అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం లక్ష్మి, అంగన్వాడీ ఆయాలు, ఆరోగ్య కార్యకర్తలు, బీజేపీ మహిళా నాయకులు పాల్గొన్నారు. అంగన్వాడీ కేంద్రాల సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం, తల్లి--శిశు ఆరోగ్య పరిరక్షణ, పోషకాహారంపై అవగాహన పెంపొందించడం, అంగన్వాడీ సిబ్బంది సేవలను గుర్తించి ప్రోత్సహించడం వంటి లక్ష్యాలతో నిర్వహించిన మాసోత్సవం జగన్నాధగిరిలో సందేశాత్మకంగా సాగింది.



# అంబరాన్ని అంటిన అంతర్జాతీయ అధ్యాపక దినోత్సవ వేడుకలు







- సీనియర్ జర్నలిస్ట్ భోగాది వెంకటరాయుడుకు ఘన సన్మానం.
- సమాజ నిర్మాణంలో అధ్యాపక వృత్తి ఎంతో కీలకమైనది.
- జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ.

**కిర్లంపూడి, పెన్ పవర్,అక్టోబర్, 05:** సమాజ నిర్మాణంలో అధ్యాపక వృత్తి ఎంతో కీలకమైనదని జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ పాలకవర్గ సభ్యులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర పోలీట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ అన్నారు.కె ఎస్ ఎన్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో అంతర్జాతీయ అధ్యాపక దినోత్సవం పురస్కరించుకొని జగపతినగరంలోని సరయు ఫంక్షన్ హాల్ లో అధ్యాపక దినోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ సమాజ నిర్మాణానికి అధ్యాపక వృత్తి ఎంతో కీలకమైనదని, విద్యతోపాటు స్కిల్ డెవలప్మెంట్ కోర్సు ప్రతి విద్యార్థి నేర్చుకునే విధంగా అధ్యాపకులు కృషి చేయాలన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షులు పూల విక్రమ్ కుమార్ మాట్లాడుతూ అధ్యాపక వృత్తి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. భవిష్యత్ తరాలను మరింత విద్యావంతులుగా తీర్చిదిద్ది సమాజానికి అందించాలని అధ్యాపకులను కోరారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు భోగాది వెంకట రాయుడును విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి మెమొంటోలు అందజేశారు.ప్రముఖ సామాజికవేత్త గోకేడ రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, రిటైర్డ్ ఎడిషనల్ ఎస్పీ, ఎన్ బి ఎం మురళీకృష్ణ, అత్తిలి సీతారామస్వామి, యువ నాయకులు తోట వరుణ్, కన్నబాబు,సత్యానందం, కళాశాల కళాశాల కరస్పాండెంట్ కె.వి కుమారి, డైరెక్టర్ పి శ్రీను, ఏఓ,జె వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ రాధాకృష్ణ, ఏఓ అర్జున్, శ్రీరామ్, కళాశాల సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ నూకాలమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలి.

- ప్రత్తిపాడు నియోజకవర్గం వైసిపి ఇన్‌చార్జ్ ముద్రగడ గిరిబాబు.

**కిర్లంపూడి, పెన్ పవర్, అక్టోబర్, 05:** శ్రీ నూకాలమ్మ తల్లి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపైనా ఉండాలని ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు అన్నారు. కత్తిపూడి గ్రామంలో వేంచేసియున్న శ్రీ నూకాలమ్మ తల్లి ఆలయ పునః ప్రారంభం మరియు విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్ఆర్‌సీపీ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబును ఆలయ కమిటీ సభ్యులు ముఖ్య అతిథిగా ఆహ్వానించారు.కత్తిపూడి గ్రామానికి చెందిన గాబు గంగ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు కిర్లంపూడిలోని ముద్రగడ నివాసానికి వచ్చి ,గిరిబాబుకు మహోత్సవ శుభలేఖను అందించి ఆత్మీయంగా ఆహ్వానించారు.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి తప్పక విచ్చేసి అమ్మవారి కృపాకటాక్షాలు పొందాలని గిరిబాబును ఈ సందర్భంగా కమిటీ సభ్యులు కోరారు.



## బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి....

- రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి...
- బీఎస్పీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇంచార్జ్ గునపర్తి అపురూప్....



**శంఖవరం పెన్ పవర్ అక్టోబర్ 05:-** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని బహుజన్ సమాజ్ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇంచార్జ్ గునపర్తి అపురూప్ డిమాండ్ చేశారు.

సోమవారం ప్రత్తిపాడులోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని గతంలో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేయాలని కోరారు ప్రస్తుతం కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వాలు ఉన్నందున కేంద్ర ప్రభుత్వంతో చర్చించి బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల అంశానికి రాజ్యాంగపరమైన పరిష్కారం చూపాలని అన్నారు. అవసరమైతే రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు

స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓలను హైకోర్టు 50 శాతం రిజర్వేషన్ పరిమితి అంశంలో పక్కనపెట్టిన నేపథ్యంలో ప్రభుత్వం తదుపరి చర్యలను స్పష్టంగా ప్రకటించాలని కోరారు.

బీసీలకు న్యాయపరమైన ఇబ్బందులు లేకుండా రిజర్వేషన్లను అమలు చేసేందుకు అవసరమైన డేటాను సేకరించి, రాజ్యాంగపరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీఎస్పీ తరఫున డిమాండ్ చేస్తున్నట్లు గునపర్తి అపురూప్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీఎస్పీ ప్రత్తిపాడు నియోజకవర్గ అధ్యక్షుడు కొంగు రమేష్, పిల్లి రాజు, మురా రాంబాబు, మురా సత్య రాజకుమార్, ప్రవీణ్, నూకరాజు, అప్పారావు, నాగబాబు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

## ఆలమూరు అయ్యప్ప ఆలయంలో ముగిసిన సప్తాహ మహోత్సవాలు



**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 05:**ఆలమూరు అయ్యప్ప స్వామి ఆలయ వ్యవస్థాపకులు ఏఎం స్వామి నేతృత్వంలో ఆలమూరులో జరుగుతున్న పురందరదాసు ఆరాధన ఉత్సవాల్లో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం దాస సాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో గత ఏడు రోజులుగా జరుగుతున్న మూడవ వార్షిక సప్తాహ మహోత్సవాలు సోమవారంతో ముగిసాయి. దాస సాహిత్యంలో పురందరదాసు కీర్తనలు స్వామివారి వైభవాన్ని చాటాయని, భక్తి తత్వాన్ని ప్రేరేపించాయని ఏ ఎమ్ స్వామి ఈ సందర్భంగా తెలియజేశారు.

## ప్రజా సమస్యలకు త్వరిత పరిష్కారమే లక్ష్యం



**కాకినాడ, పెన్ పవర్,అక్టోబర్ 5:** ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించి బాధితులకు న్యాయం అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్, తెలిపారు.సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ఎస్పీ మొత్తం 43 ఫిర్యాదులను స్వీకరించారు.వీటిలో భూ తగాదాలకు సంబంధించి 8,కుటుంబ కలహాలకు సంబంధించి 8, ఇతర సమస్యలకు సంబంధించి 27 ఫిర్యాదులు ఉన్నాయి. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను ఎస్పీ తెలుసుకున్నారు.అనంతరం సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులతో మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి వాస్తవాలను నిర్ధారించిన వెంటనే చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఏడు రోజుల్లోగా విచారణ పూర్తి చేసి, తగిన పరిష్కారం చూపడంతో పాటు, తీసుకున్న చర్యల వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. ప్రజా సమస్యలను న్యాయపరంగా పరిష్కరించడంలో కాకినాడ జిల్లా పోలీసులు పూర్తి నిబద్ధతతో పనిచేస్తున్నారని, ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడమే పోలీసుల ప్రధాన కర్తవ్యమని ఎస్పీ స్పష్టం చేశారు.

# ఈనెల 7న జగ్గంపేటలో మెగా కిసాన్ మేళా



**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 5:** రైతులకు శాస్త్రీయ సాగు పద్ధతులపై అవగాహన కల్పించేందుకు జగ్గంపేటలో భారీ కిసాన్ మేళా నిర్వహించనున్నారు. అక్టోబర్ 7వ తేదీన జగ్గంపేట డిగ్రీ కళాశాల సమీపంలోని కాపు కళ్యాణ మండపంలో భారత ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, వ్యవసాయ శాఖ, ఆత్మ కమిటీ ఆధ్వర్యంలో ఈ కిసాన్ మేళా జరగనుంది. ఈ మేళాకు జగ్గంపేట ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. జగ్గంపేట రావులమ్మ నగర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు గరిమెల్ల శ్రీనివాస్ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ మేళాలో రైతులు శాస్త్రీయ పద్ధతులు తెలుసుకొని వ్యవసాయ సమస్యలపై పరిష్కారాలు తెలుసుకుంటారని అన్నారు. కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని, రైతులకు అండగా నిలుస్తోందని తెలిపారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కిసాన్ మేళాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట మండలం వ్యవసాయ శాఖ అధికారి ఎస్ నరసింహా, క్లస్టర్ ఇంచార్జి బస్వా చినబాబు తదితరులు పాల్గొన్నారు.

# జగ్గంపేటలో ఓవర్ హెడ్ ట్యాంక్ కు ఎమ్మెల్యే నెహ్రూ శంకుస్థాపన



**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 05:** జగ్గంపేట-గుర్రంపాలెం రోడ్డులోని బాలాజీ నగర్ ఎదురుగా గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య శాఖ ఆధ్వర్యంలో నిర్మించనున్న ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ శంకుస్థాపన మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జగ్గంపేట ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులు, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూముఖ్య అతిథిగా హాజరై కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ జగ్గంపేట పట్టణంలోని కొన్ని ప్రాంతాల దీర్ఘకాలిక తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా రూ.63 లక్షల వ్యయంతో ఈ ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మిస్తున్నామని, ఈ ట్యాంక్ ద్వారా జగ్గంపేట ప్రాంతంలో నిరంతర మంచినీటి సరఫరా అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి, నాయకులు, అధికారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర,స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి-కిర్లంపూడిలో బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్





**కిర్లంపూడి,పెన్ పవర్, అక్టోబర్, 05:**స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, జగ్గంపేట నియోజకవర్గ ఇన్చార్జి కుండల సాయికుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు ఆదేశాల మేరకు సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా జగపతి నగరం పంచాయతీలో సోమవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. కిర్లంపూడి మండల అధ్యక్షుడు శరకణం రాజబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సాయికుమార్ యాదవ్ హాజరై పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు అల్లు శివరామకృష్ణ, జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షుడు కంటా కాశీ విశ్వనాథం, ప్రధాన కార్యదర్శి కోనేటి శ్రీనివాసరావు, మిరియాల వెంకటేష్, మండల ఓబీసీ అధ్యక్షుడు పెంటకోట సత్యనారాయణ, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు గండే సూర్యారావు, ఉపాధ్యక్షులు పెద్దగాడ లోవరాజు, కొప్పిశెట్టి జగదీష్, కర్రి పురుషోత్తం, అద్దగర్ల శ్రీనివాస్, కోలా కృష్ణ, శరకణం సన్యాసిరావు, కాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రాజపూడి పాఠశాలలో అదనపు నూతన తరగతి గదులు ప్రారంభం





**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 05:** జగ్గంపేట మండలం రాజపూడి గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నూతనంగా నిర్మించిన 8 అదనపు తరగతి గదులను జగ్గంపేట ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ ఘనంగా ప్రారంభించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో చిన్నారులతో కలిసి సహపంక్తి భోజనం చేసి వారితో ఆప్యాయంగా ముచ్చటించారు. జిల్లా టిడిపి అధికార ప్రతినిధి రేఖా బుల్లి రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జగ్గంపేట నియోజకవర్గం అబ్జర్వర్, అమలాపురం రూరల్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి విద్యయే తొలి ప్రాధాన్యమని, నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థకు మహర్దశ పడుతోందన్నారు. గత ప్రభుత్వం పాఠశాలలను నిర్వీర్యం చేస్తే, నేడు కూటమి ప్రభుత్వం ప్రతి పాఠశాలకు అన్ని మౌలిక వసతులు, మరుగుదొడ్లు, తాగునీరు, ఫర్నిచర్, డిజిటల్ బోధన కల్పిస్తోందని పేర్కొన్నారు. రాజపూడి పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని, ఇక్కడ బాలికల కోసం ఇంటర్మీడియట్ విద్యను ప్రారంభించి ప్లే స్కూల్ గా అభివృద్ధి చేశామని, అదేవిధంగా బాలురకు కూడా ఇంటర్మీడియట్ కావాలని గ్రామస్తులు కోరడంతో ఆ ప్రతిపాదనను త్వరలోనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

# జి జి హెచ్ ఆసుపత్రి ద్వారా రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించండి





**రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు**

**కాకినాడ, పెన్ పవర్,అక్టోబర్ 05:** కాకినాడ జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి నందు వైద్య సేవల నిమిత్తం వచ్చే పేషెంట్లకు సకాలంలో వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు పేర్కొన్నారు..సోమవారం సాయంత్రం కలెక్టర్ చాంబర్ నందు రాజ్యసభ సభ్యులు, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్,ఎం ఎల్ సి కర్రి పద్మశ్రీ,కాకినాడ అర్బన్ రూరల్ శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వర రావు,పంతం నానాజీ లతో కలసి జిల్లా ప్రధాన ఆస్పత్రి పనితీరు పై సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం వైద్య శాఖను బలోపేతం చేస్తూ ప్రజలకు సకాలంలో సరైన వైద్యం అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని తెలిపారు.. వైద్య సేవల నిమిత్తం సర్వజన ఆస్పత్రికి వచ్చే పేషెంట్లకు సత్వరమే వైద్య సేవలు అందేలా డాక్టర్లు సిబ్బంది అందుకు అనుగుణంగా బాధ్యతగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అనుగుణంగా చర్యలు చేపట్టడంలో భాగంగా నర్సింగ్ విద్యనభ్యసించే విద్యార్థులను కూడా వైద్య సేవలను నిమిత్తం వినియోగిస్తున్నట్లు ఆస్పత్రి సూపరిండెంట్ తెలిపారు.

**పంట కాలువలు డ్రైనేజీ లపై ఉన్న ఆక్రమణల తొలగింపు నకు చర్యలు**

ఇటీవల కురిసిన వర్షాల వల్ల రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్న కాలనీలతోపాటు పంట కాలవలు మరియు డ్రైనేజీల నుండి నీరు వెళ్లేందుకు అవకాశం లేకుండా ఆక్రమణలకు గురైన వాటి తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ఎంపీ తెలిపారు. ఇందుకు సంబంధించి ఏర్పాటైన త్రీ మెన్ కమిటీ వారు సర్వే తో పాటు ఇరిగేషన్, రెవిన్యూ కార్పొరేషన్ అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేసి ఆక్రమణలు తొలగించాలని తెలిపారు..తద్వారా రానున్న కాలంలో కురిసే వర్షాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు అవకాశం ఉంటుందని ఆ దిశగా పనిచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలను గడువులోగా పరిష్కరిం చాలి






- పి జి ఆర్ ఎస్ నందు 328 అర్జీలు
- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేశీధిర ప్రసాద్

**కాకినాడ, పెన్ పవర్,అక్టోబర్ 5:**ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజలకు పారదర్శకమైన,జవాబు దారీతనంతో కూడిన సేవలు అందించడమే జిల్లా యంత్రాంగం ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఎం. ఎన్.హరేశీధిర ప్రసాద్ స్పష్టం చేశారు.

జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ...ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజలు సమర్పించే ప్రతి అర్జీని అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్ణీత గడు వు లోగా పరిష్కరించాలని అధికారులను ఆదే శించారు. సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతా యుతంగావ్యవహరించాలన్నారు.ప్రతి అర్జీని నమోదు చేసి, దాని పరిష్కార పురోగ తిని నిరంతరం పర్యవేక్షిం చాలని తెలిపారు. అర్జీల పరిష్కారంలో జాప్యం జరిగితే అందుకు సంబంధించిన కారణాలను స్పష్టంగా నమోదు చేయాలని,అర్జీ దారులకు నిర్ణీత సమయం లోగా సమాచారం అందించాలని ఆదేశించారు. డివిజన్,మండల కార్యాలయాలు,మున్సిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు.

**రెవెన్యూ క్లినిక్ కు 40 అర్జీలు.**

జిల్లా కలెక్టరేట్ లో జరిగిన రెవిన్యూ క్లినిక్ లో భాగంగా జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ తిప్పే నాయక్ ప్రజల నుంచి రెవిన్యూ సమస్యల మీద అర్జీలు స్వీకరించారు.ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరమే స్పందించి సమగ్ర మైన విచారణ చేపట్టి నిర్దేశిత గడువులోగా తగిన పరిష్కారం అందించాలని ఆయా శాఖల అధి కారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు ఎస్ మల్లి బాబు, పి కృష్ణమూర్తి వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు, కలెక్టరేట్ సెక్షన్ల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడలో స్కిల్ డెవలప్‌మెంట్ హబ్ స్థాపన అత్యంత అభినందనీయం:

**పెద్దాపురం శాసన సభ్యులు నిమ్మకాయల చినరాజప్ప**




**కాకినాడ, పెన్ పవర్, అక్టోబర్ 5:**ఈ కార్యక్రమంలో పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప మాట్లాడుతూ.. కాకినాడలో రూ. 5 నుంచి 6 కోట్ల అంచనా వ్యయంతో స్కిల్ డెవలప్‌మెంట్ హబ్‌ను ఏర్పాటు చేసి, దాని ద్వారా ఇంక్యుబేషన్ సెంటర్లు తదితర సదుపాయాలను యువతకు అందుబాటు లోకి తీసుకురావడం అత్యంత అభినందనీయమని కొనియాడారు. రాష్ట్రంలో యువతకు విస్తృతంగా ఉద్యోగావకాశాలు కల్పించాలనే ఏకైక లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మరియు ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ లు తీవ్ర కృషి చేస్తున్నారని తెలిపారు. విద్యాశాఖ మంత్రి కాకినాడ ప్రాంతానికి ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చి, స్థానిక యువతకు ఉపాధి కల్పించేలా విద్యా రంగంలో సంస్కరణలు తెస్తూ అనేక సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు.ఈ క్రమంలోనే ప్రభుత్వం ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలల ప్రాంగణంలో స్థలాన్ని కేటాయించగా, రాజ్యసభ సభ్యులు ముందుకు వచ్చి ఈ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన యువతకు భవిష్యత్తులో ఉద్యోగావకాశాలు, వర్సిటీ స్థాయిలో ఉన్నత విద్యా అవకాశాలు దక్కాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ ఆశయాలకు, మంత్రి లోకేష్ ఆలోచనలకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినందుకు ఎంపీ సానా సతీష్ బాబుకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## ప్రముఖ చిత్రకారుడు కంపరపు నాగేశ్వరరావుకు సన్మానం



**కిర్లంపూడి, పెన్ పవర్, అక్టోబర్, 05:**ప్రముఖ చిత్రకారులు కీ.శే. ఆచార్య వరదా వెంకటరత్నం జయంతి సందర్భంగా రాజమహేంద్రవరంలోని దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీలో కళాకారుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ చిత్రకారుడు కంపరపు నాగేశ్వరరావును హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. కళారంగానికి విశేష సేవలు అందిస్తున్న పలువురు కళాకారులను ఈ సందర్భంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం చిత్రకళా నికేతన్ వ్యవస్థాపక కార్యదర్శి, సహాధ్యాయ మిత్రుడు టేకి మృత్యుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com